రిపోర్టర్లు కావలెను

జనం కోసం నిరంతరం అక్షర సమరం చేసేందుకు దూసుకు వస్తున్న 'జర్నలిస్ట్ ఫైల్' దినపత్రికకు ఏపీలో జిల్లా ప్రతినిధులుగా పనిచేయుటకు విలేకరులు కావలెను. తెలుగులో స్పష్టంగా మాట్లాడటం, ఆసక్తి, అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత. కొత్త వారికి అవకాశం ఉంటుంది.

సంప్రదించాల్సిన సెల్ నెం : 9502535152, 7416812467

శనివారం 20.04.2024

INK OF TRUTH

జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 32 సంచిక -95 www.journalistfile.com పేజీలు 6 వెల : రూ.5.00

ఓ నాయకా...

'జంఝావతి' గుర్తుందా ?

పార్వతీపురం (జర్నలిస్ట్ ఫైల్): 'జంఝావతి ప్రాజెక్టు'ను దశాబ్దాలుగా పాలకులు విడిచిపెట్టేశారు. అధికారంలోకి రాగానే ప్రాజెక్టు పరిధిలో నెలకొన్న సమస్యలన్నింటినీ పరిష్కరిస్తాం. పూర్తిస్థాయిలో నీరందించి పార్వతీపురం నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తాం' అని ప్రతి ఎన్నికల సమయంలో హామీలు ఇవ్వడం... అధికారంలోకి వచ్చిన 'జంఝావతి ప్రాజెక్టు'ను మర్చిపోవడం అన్ని రాజకీయ పార్టీలకు షరా మామూలు గా మారింది. మన్యంలోని కొమరాడ, గరుగుబిల్లి, పార్వతీపురం, సీతానగరం, మక్కువ మండలాల్లో 24 వేల ఎకరాలకు పైగా సాగునీరు అందించేందుకు కొమరాడ మండలంలోని రాజ్యలక్ష్మీపురం సమీపంలో 1976లో రూ. 15.51 కోట్లతో జంఝావతి నదిపై ప్రాజెక్టును ప్రారంభించారు. కొన్నినెలల పాటు పనిచేసినా.. తరువాత ఒడిశా అభ్యంతరం తెలిపింది. జలాశయం సమీపంలో తమ రాష్ట్రానికి చెందిన 11 గ్రామాల్లోని 1100 ఎకరాల భూమి ముంపుబారిన పడుతోందని, ఆ ప్రభావం పెరిగే అవకాశం ఉందని చెప్పింది. ఇందులో అటవీ ప్రాంతం ఎక్కువ కావడంతో కాస్త ఆటంకం ఏర్పడింది.

1980లో చర్చలు..

వివాదాస్పద స్థలం మునిగిపోకుండా 1980లో రెండు రాష్ట్రాల మధ్య చర్చలు జరిగాయి. దీంతో ఓ ఒప్పందానికి వచ్చారు. జలాశయానికి అవసరమైన పనులు చేసుకోవచ్చని ఒడిశా భరోసా ఇచ్చింది. అయితే ముంపు సమస్య మాత్రం పరిష్కారానికి రాలేదు. ముఖ్యమంత్రి హోదాలో సీఎం జగన్మోహన్ రెడ్డి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ను భువనేశ్వర్ లో కలిశారు.

తాత్కాలికంగా రబ్బరు డ్యాం..

ఒడిశా ఒప్పుకోకపోవడంతో స్పిల్ వే నిర్మించకుండా 2006లో రబ్బరు డ్యాం ఏర్పాటు చేశారు. నీరు చేరితే.. దానంతట అదే దిగువకు వెళుతుంది. ఇలా దాదాపు 12 వేల ఎకరాలకు నీరందుతుందని భావించారు. 3.6 కిలోమీటర్ల మేర లింకు కాలువను తవ్వి, ఎత్తిపోతలతో మరో 12 వేల ఎకరాలకు నీరివ్వాలనుకున్నారు. ఈమేరకు 650 హెచ్పీ మోటార్లు మూడు, ప్రత్యేకంగా విద్యుత్తు సబ్ స్టేషన్ ను పెట్టారు. కానీ ఇవన్నీ అక్కరకు రాలేదు. పక్క రాష్ట్రం ఒప్పుకొంటే రివర్ గ్యాప్ ను మూసేసి, గేట్లు ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంది. కానీ ఆ దిశగా అడుగులు పడడం లేదు.

స్పందించని కాంట్రాక్టర్లు

జలాశయం ప్రారంభం నుంచి ఇప్పటి వరకు రూ. 124 కోట్ల అంచనాతో పనులు జరిగాయి. కానీ అవేవీ పూర్తి కాలేదు. కాలువల ఏర్పాటు, ఇతర పనులకు రూ. 28.50 కోట్లు మంజూరు చేసింది. నెల్లూరుకు చెందిన కాంట్రాక్టరుకు అప్పగించారు. కాలువలు, సూపర్ పాసేజ్, ఓటీలు తదితరాలు నిర్మించాలి. డిస్ట్రిబ్యూటరీలకు సంబంధించి 250 వరకు నిర్మాణాలు చేపట్టాలి. అయితే బిల్లుల చెల్లింపుల్లో జాప్యంతో కదలిక లేదని తెలుస్తోంది. దీంతో తమను తప్పించాలని సదరు కాంట్రాక్టర్లు బహిరంగంగానే కోరుతున్నారు.

ఆ బండరాయే తొలగించలేక..

కొమరాడ మండలం దంగభద్ర దగ్గర కాలువలో ఉన్న బండరాయిని తొలగించడానికి రూ. 4 కోట్లు మంజూరయ్యాయి. దీన్ని తొలగిస్తే తప్ప నీరు స్వేచ్ఛగా కాలువలో ప్రవహించే పరిస్థితి లేదు. ఈ ప్రక్రియ కొన్నేళ్లుగా సాగుతూనే ఉంది.

రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో

నాకెంత... నీకెంత !

రాజమహేంద్రవరం (జర్నలిస్ట్ ఫైల్): ప్రజాధనం వృథా అయినా ఫర్వాలేదు. రోగులు పాట్లు పడినా పట్టించుకోరు.. కావాల్సిన మందులు ఉండవు.. అవసరం లేనివి మాత్రం పదేసి రెట్లు అధికంగా ఇండెంట్ పెట్టి తెప్పించేస్తారు. వచ్చినవన్నీ అందుబాటులో ఉన్నాయా లేక పక్కదారి పట్టాయా అనేది వారికే తెలియాలి.. ఇదీ రాజమహేంద్రవరం సర్వజన ఆసుపత్రిలో పరిస్థితి. ఈ సర్వజన ఆసుపత్రిలోని రోగనిర్ధారణ పరీక్షలు చేసే ల్యాబుల్లో పరిస్థితి మరీ వింతగా ఉంటోంది. అవసరానికి మించి రోగ నిర్ధారణ కిట్లు తెప్పించడం, అవి ఉన్నాయో లేదో తెలియని వైనం ఒకటైతే.. అందులో పనిచేసే కొందరు ల్యాబ్ టెక్నీషియన్లు బయట సొంతంగా ల్యాబులు పెట్టుకుని అక్కడి పరీక్షలు సైతం జీజీహెచ్ కిట్లను ఉపయోగించుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జీజీహెచ్ కు వచ్చే నమూనాలను వారి ల్యాబులకు తీసుకెళ్లి ఉచితంగా అయ్యే పరీక్షలకు డబ్బులు వసూలు చేస్తున్న దాఖలాలు కనిపిస్తున్నాయని చెబుతున్నారు. రాజమహేంద్రవరం వైద్యశాల జీజీహెచ్ మారిన తరువాత సిబ్బంది, వైద్యులు పెరగడంతో పాటు ల్యాబ్ లను సైతం బయోకెమిస్ట్రీ, మైక్రోబయాలజీ, పెథాలజీ గా మార్చారు. ఇందులో మైక్రోబయాలజీకి సంబంధించి ఇన్ఫ్లూయెంజా వైరస్ వచ్చినప్పుడు ఉపయోగించే హెచ్1ఎన్1 కిట్లను వినియోగం కంటే 15 రెట్లు అధికంగా ఎందుకు తెప్పించారో ఆ విభాగపు అధికారులకే తెలియాలి. సాధారణంగా వీటిని అప్పుడప్పుడు మాత్రమే వినియోగిస్తుంటారు. నెలకు సుమారు పది లోపు కూడా వినియోగించని పరిస్థితి. అలాంటిది ఒకేసారి అయిదు వేల కిట్లను ఏపీఎంఎస్ ఐడీసీ నుంచి తెప్పించారు.

బయోకెమిస్ట్రీ కి సంబంధించి గుండెపోటు వచ్చిన రోగులకు పరీక్ష చేసే ట్రోపో నైన్ కిట్లను మూడువేల వరకు రప్పించారు. నెలకు సుమారు 30 కూడా వినియోగించని వీటిని మూడువేల వరకు ఇండెంట్ పెట్టి తెప్పించడం విమర్శలకు తావిస్తోంది. కీటోన్ బాడీస్ తెలుసుకునే కీటో కిట్లను సైతం మూడువేల వరకు రప్పించారు. ఇందుకోసం సుమారు రూ. 4 లక్షల

2 లో

నీరెరగని కాల్వలు

అనంతపురం (జర్నలిస్ట్ ఫైల్) : కాలువల్లో నీరు పారినపుడే వ్యవసాయం ఆశాజనకంగా ఉంటుంది. అనంతపురం జిల్లాలో వ్యవసాయానికి కాలువలే ఆయువుపట్టు. అయితే అధికారులు మాత్రం కాలువల నిర్వహణ పూర్తిగా గాలికొదిలేశారు. పిచ్చి మొక్కలతోను, చెట్లు పెరిగి కాలువలు రూపు కోల్పోతున్నాయి. పీఏబీఆర్, పేరూరు జలాశయం, మిడ్పెన్నార్ జలాశయం కాలువలను ఐదేళ్లుగా పట్టించుకోలేదు. వీటిలో నీరు పారటమే గగనమైంది. ఈ రెండు జలాశయాల కాలువల కింద వందల ఎకరాల్లో ఆయకట్టు ఉంది. లైనింగ్ లేక చాలాచోట్ల కట్టలు బలహీనంగా మారుతున్నాయి. పీఏబీఆర్ కాలువ ఉరవకొండ, రాప్తాడు, ధర్మవరం, శింగనమల నియోజకవర్గాల్లో అనేక గ్రామాలకు సాగునీరు అందిస్తుంది. ఈ కాలువ పరిధిలో అనేక చెరువులను నింపేందుకు ఇదొక్కటే ఆధారం. భూగర్భ జలాల పెరుగుదలకూ ఉపయోగపడుతుంది.

పేరూరు జలాశయం కుడికాలువ పరిధిలో కనగానపల్లి, రాప్తాడు, రామగిరి మండలాల్లో 10 వేల ఎకరాల ఆయకట్టు ఉన్నా పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. మిడ్పెన్నార్ డ్యాం నుంచి దక్షిణ కాలువ ద్వారా గార్లదిన్నె అనంతపురం రూరల్, బీకేఎస్, నార్పల, పుట్లూరు, యల్లనూరు మండలాలకు సాగునీరు అందితోంది. గతంలో ఈ కాలువను ఆధునికీకరించారు. ఇదేళ్లుగా ఆధునికీకరణకు నోచుకోక కాలువలు ఆనవాళ్లు కోల్పోతున్నాయి. జలాశయాల్లో నీరున్నా కాలువకు వదిలే పరిస్థితే లేదంటే ఇది కచ్చితంగా అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్టగా చెప్పొచ్చు... ఆయకట్టు రైతులకు ఇదంతా వేదన భరితమే.

విచ్చలవిడిగా విధ్వంసం

పశ్చిమ గోదావరి బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్): అవినీతి అధికారుల అండతో జిల్లాలో సహజ వనరుల విధ్వంసం విచ్చలవిడిగా సాగుతోంది. ముఖ్యంగా జంగారెడ్డిగూడెం, కుక్కునూరు, బుట్టాయగూడెం, ఉంగుటూరు ప్రధాన కేంద్రాలుగా నిత్యం కలప అక్రమ రవాణా, అడవుల ఆక్రమణ, అటవీ భూముల్లో మట్టి తవ్వకాల దందా యథేచ్ఛగా సాగుతోంది. అధికారిక లెక్కల ప్రకారం.. ఒక్కకుక్కునూరు రేంజ్లోనే 14 వేల హెక్టార్లలో అడవులు ఆక్రమణకు గురయ్యాయి. వాటిని చదును చేసి సాగు భూములుగా మార్చుతున్నారు.

మైదాన ప్రాంతాలుగా రిజర్వు అడవులు

రిజర్వు అడవులు మైదాన ప్రాంతాలుగా మారుతున్నాయి. వందల ఏళ్లనాటి చెట్లను నరుక్కుపోతూ అటవీ దొంగలు రూ. లక్షలు ఆర్జిస్తున్నారు. పలుచోట్ల ఏపీఎఫ్ సీ జామాయిల్ కలపను ఇంటి దొంగలే కాజేస్తున్నారు. సామిల్లులు, కోత యంత్రాల అనుమతులకు, వాటిలో జరుగుతున్న కోత పనులకు పొంతన ఉండటం లేదు. కళ్ల ముందే అక్రమాలు జరుగుతున్నా ఆ శాఖ కళ్లప్పగించి చూస్తోంది. ఉన్నతాధికారులు, టాస్క్ఫోర్స్, ఫ్లయింగ్ స్క్వాడ్ లకు సమాచారం చేరుతున్న సందర్భాల్లోనే అక్రమ రవాణా వెలుగు చూస్తోంది. లేని పక్షంలో నామ మాత్రం కేసులతో సరిపుచ్చుతున్నారు.

ముడుపులపై తగాదా

కుక్కునూరు అటవీ పరిధి సీతానగరంలో దాదాపు 400 ఎకరాల్లో చెట్లను నరికి పత్తి, జామాయిల్ సాగుచేస్తున్నారు. వెంకటాపురంలో ఇటీవల అటవీ ఆక్రమణలపై గొడవ జరిగింది. దీనిపై విచారణకు వచ్చిన అధికారుల వద్ద ఆక్రమణ దారులు తాము అటవీ సిబ్బందికి ముడుపులు ఇస్తున్నట్లు బహిరంగంగానే వాదించారు. బంజరగూడెం నుంచి వేలేరు వరకు జామాయిల్ క్లోనల్ నర్సరీలు వెలిశాయి. పెదరాయిగూడెం, వేలేరు, ఇబ్రహీంపేట క్రాస్ రోడ్ సమీపంలోని అటవీ ప్రాంతాన్ని చదును చేసి నర్సరీలు ఏర్పాటు చేస్తున్నారు. బడాబాబులు, ఉద్యోగులు కూడా ఉండటం విశేషం.

పక్కదారి పట్టిన సంపద

ఉంగుటూరు వీఎస్ఎస్ జనవరి, ఫిబ్రవరి నెలల్లో నారాయణపురం, వెంకట్రామన్నగూడెం తదితర

2 లో

పాపం పోలీస్



అమరావతి (జర్నలిస్ట్ ఫైల్): పోలీసులకు వీక్లీ ఆఫ్ ప్రకటిస్తున్నాం. అందరు ఉద్యోగుల మాదిరిగానే వారాంతపు సెలవులు తీసుకోవచ్చు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తున్నాం' 2019లో సీఎం జగన్ చేసిన ప్రకటన ఇది.

ఈ ప్రకటన పోలీసు సిబ్బందితో పాటు వారి కుటుంబాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. నాలుగున్నర ఏళ్ళు దాటిపోతున్నా క్షేత్రస్థాయిలో ఈ ఉత్తర్వులు అమలు కావడం లేదు. ప్రారంభంలో కొన్నిచోట్ల అమలైనప్పటికీ, ప్రస్తుతం రాష్ట్రంలో ఎక్కడా అమలవుతున్న దాఖలాలు లేవు.

వీక్లీ ఆఫే కాదు.. లీవూ లేదు

'వీక్లీ ఆఫ్ ప్రకటించి నాలుగున్నర ఏళ్లవుతున్నా మా వరకు వచ్చేసరికి అమలు కావడం లేదు. వీక్లీ ఆఫ్ అటుంచితే, వ్యక్తిగత సెలవు పెట్టాలన్నా, మా విధుల్ని మరొకరికి అప్పగించి రావాల్సి వస్తోంది. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేకుంటే పర్సనల్ లీవు లీవ్ దొరకడం కష్టం. వారానికి ఒకసారి కూడా భార్యాపిల్లలకు సమయం కేటాయించలేకపోతున్నాం. వీక్లీ ఆఫ్‌ల గురించి ప్రభుత్వం ఇచ్చిన జీవోను అధికారులు క్షేత్రస్థాయిలో అమలు చేయాలి' – ఓ కానిస్టేబుల్ ఆవేదన రాష్ట్ర పోలీస్ శాఖలో వారాంతపు సెలవు చిరకాల స్వప్నం గా మారింది. నేర నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణలో కీలకంగా పనిచేసే పోలీసుశాఖకు

2 లో

జనాలను చంపేస్తారా ?

శ్రీకాకుళం (జర్నలిస్ట్ ఫైల్): ప్రజల కష్టార్జితం చెలించే పన్నుల నుంచి జీతాలు తీసులుంటున్న అధికారులు ప్రజా సంక్షేమం కోసంపాటు పడాలి. ప్రజలు ఇబ్బందులు పడకుండా అవసరమైన చర్యలు ఎప్పటికప్పుడు తీసుకోవాలి. కానీ అధికారుల్లో ఇవేవీ కనిపించ లేదు. అధికారుల నిర్లక్ష్య వైఖరితో శ్రీకాకుళం నగర ప్రజలకు వరద ముప్పు తో బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు.

నగరంలోని కొత్త వంతెన సమీపంలో నాగావళి నదిలో గతంలో చేపట్టిన డైక్ పనులను పూర్తి చేయండంలో అధికారులు పూర్తి నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నారు. అధికారులు పట్టనట్లు వ్యవహరించడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా పరిస్థితి మారింది.

అసంపూర్తి పనులతో అవస్థలు

పనులు మధ్యలో నిలిచిపోవడంతో ఆ ప్రాంతంలో కొండలను తలపించేలా నగరానికి రక్షణ కవచంలా ఉండే ఇసుక మేటలు, దానికి ఆనుకుని ఉండే నది గట్టు, చెట్లు, ఓ ప్రైవేటు పాఠశాల ప్రహరీ ఇలా పలు నిర్మాణాలు గత నాలుగేళ్లుగా వరదల ధాటికి నది గర్భంలో కలిసిపోయాయి. కోతకు గురైన రక్షణ గోడ పనులు చేపట్టక పోవడంతో ఈ ఏడాది వరదలు వస్తే నగరంలోని డే అండ్ నైట్ ప్రాంతం ముంపు బారిన పడే ప్రమాదం ఉందని ప్రాణ, ఆస్తి నష్ట భయంతో అక్కడి నివాసితులు ఆందోళన చెందుతున్నారు.

రూ. 4.95 కోట్ల అంచనాతో పనులు

నగర ప్రజలకు బలగ, ఆదివారంపేట ప్రధాన నీటి సరఫరా కేంద్రాల ద్వారా మండు వేసవిలో సైతం పూర్తిస్థాయిలో తాగునీరందించే లక్ష్యంతో ఆకర్షణీయ నగరం పథకం (స్మార్ట్ సిటీ) ద్వారా రూ. 4.95 కోట్ల అంచనా వ్యయంతో డైక్ నిర్మాణ పనులు గతంలో చేపట్టారు. దాదాపు 50 శాతం మేర పనులు పూర్తయ్యాయి. కాంట్రాక్టరుకు బిల్లులు సైతం చెల్లించారు. అనంతరం పనులు విస్మరించడం నగర ప్రజలకు శాపంగా మారింది.

ప్రజల ప్రాణాలంటే లెక్కలేదా..?

కోతకు గురైన ప్రాంతంలో కాంక్రీటుతో రక్షణ గోడ నిర్మించి నగరాన్ని వరద ముంపు నుంచి కాపాడాల్సిన అధికారులకు ప్రజల ప్రాణాలంటే లెక్క లేకుండా పోయిందని నగర వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడేళ్ల క్రితం నదికి భారీగా వరద వచ్చిన సమయంలో గట్టు తీవ్రంగా కోతకు గురైంది. అప్పట్లో కలెక్టర్, శ్రీకాకుళం శాసనసభ్యుడు ధర్మాన ప్రసాదరావు సమాలోచనలు జరిపి

రాష్ట్ర నీటి పారుదలశాఖ ముఖ్య సలహాదారుడు రౌతు సత్యనారాయణను అమరావతి నుంచి ఇక్కడకు రప్పించి ఆయన సూచన మేరకు ఈ ప్రాంతంలో శాశ్వత ప్రాతిపదికన కాంక్రీటు రక్షణ గోడ నిర్మించాలని నిర్ణయించారు. నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన ఈ పనులకు ఆ శాఖ అధికారులు రూ. 5.5 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసి కలెక్టర్ ద్వారా ఉన్నతాధికారులకు నివేదించారు. ఇంతవరకు దాని గురించి స్పందన లేకపోవడం గమనార్హం.

నగరపాలక సంస్థపై రూ. 1.2 కోట్ల భారం

రక్షణ గోడ పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయక పోవడంతో నగరపాలక సంస్థ తాత్కాలిక పనులు చేపట్టాల్సి వచ్చింది. అందులో భాగంగా రూ. 1.2 కోట్ల మేర ఖర్చు చేసింది. బలగ ప్రధాన నీటి సరఫరా ప్రాంతంలో రూ. 70 లక్షలు వరకు వెచ్చించి భవన నిర్మాణ వ్యర్థాలతో, మరో రూ. 52 లక్షలతో కొత్తవంతెన ప్రాంతంలో ఇసుక బస్తాలతో తాత్కాలికంగా రక్షణ గోడ ఏర్పాటు చేశారు. ఇసుక బస్తాల రక్షణ గోడ శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ఈ ఏడాది వరదలకు ఈ రక్షణ గోడ సైతం కొట్టుకు పోయే ప్రమాదం ఉందని నీటిపారుదల ఇంజినీరింగ్ నిపుణులు చెబుతున్నారు.

మారిన నది గమనం

మధ్యలో నిలిచిన పనులతో 40 శాతం మేర డైక్ శిథిలావస్థకు చేరుకుంది. రక్షణ గోడ పనులు పూర్తయితే తప్ప వీటిని పునరుద్ధరించే అవకాశం లేదు. బలగ ప్రధాన నీటి సరఫరా కేంద్రం వైపు నదికి అడ్డంగా నిర్మించిన డైక్తో ఫాజిల్ బేగ్ పేటలోని దత్తాత్రేయ గుడి వైపు నది గమనం మారి పోయింది. దీంతో డైక్కు లోపల వైపు ఇసుక మేటలు పేరుకుపోయాయి. ఫలితంగా నదిలో ఉన్న బలగ, ఆదివారంపేట ప్రధాన నీటి సరఫరా కేంద్రాల ఊట బావులకు పూర్తిస్థాయిలో నీరందని పరిస్థితి నెలకొంది.

రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో నాకెంత... నీకెంత !

(మొదటి పేజీ తరువాయి)

వరకు ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. వీటిని వెనక్కి పంపేందుకు చర్యలు చేపట్టామని ఉన్నతాధికారులు చెబుతున్నా... ఇవి ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నాయా లేక పక్కదారి పట్టాయా అన్నదానిపై దృష్టిసారించాల్సి ఉంది. ఆయా విభాగాల హెచ్ ఓ డీల పర్యవేక్షణపై సందేహాలు రేకెత్తిస్తున్నాయి.

ప్రైవేటుగా దోపిడీ..

ఆసుపత్రిలో పనిచేసే కొందరు ల్యాబ్ టెక్నీషియన్లు నగరంలో ప్రైవేటుగా ల్యాబ్స్ ఏర్పాటు చేసుకుని ఆసుపత్రికి వస్తున్న రోగులను మభ్యపెట్టి నమూనాలను తీసుకొస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. జీజీహెచ్ లోని కొన్ని కిట్లను సైతం మాయం చేసి సొమ్ము చేసుకుంటున్నారనే విమర్శలు లేకపోలేదు. ఇద్దరు ఉద్యోగులు ముఠాగా ఏర్పడి ప్రైవేటు ల్యాబులకు థైరాయిడ్ పరీక్షల కోసం వచ్చిన నమూనాలను సొమ్ములు తీసుకుని అర్ధరాత్రి సమయాల్లో జీజీహెచ్లోని యంత్రాలపై పరీక్షలు చేసేసుకుని రిపోర్టులు ఇచ్చేస్తున్నట్లు తెలుస్తోంది. కొన్నాళ్ల నుంచి ఇదంతా జరుగుతున్నా ఆయా విభాగాల హెచ్ ఓ డీ లు నోరు మెదపకపోవడం గమనార్హం. రోగులపై దురుసు ప్రవర్తన, ఇష్టానుసారం మాట్లాడటం వంటి ఆరోపణలు సైతం ల్యాబ్ ఉద్యోగులపై అధికంగా ఉన్నాయి.

పాపం పోలీస్

(మొదటి పేజీ తరువాయి)

వారంలో ఒక రోజు సెలవు లేకపోవడంతో సిబ్బంది తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. డిపార్ట్మెంట్ లో వీక్లీ ఆఫ్ దశాబ్దాలుగా సాగుతున్న సమస్య. దీన్ని అధిగమించేందుకు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి స్వయంగా వరం ఇచ్చి, ఉత్తర్వులు జారీ చేసిన కూడా.. వీక్లీ ఆఫ్ లు అమలుకావడం లేదు రోజంతా విరామం లేకుండా విధుల్లో కొనసాగుతుండటంతో సిబ్బంది మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. సిబ్బంది కొరత కారణంగా కొన్నిచోట్ల, సిబ్బంది ఉన్నా మరికొన్నిచోట్ల, మొత్తంగా అన్నిచోట్లా పోలీసులకు వీక్లీ ఆఫ్ అమలు కావడం లేదు. పెరిగిన పనిభారం కారణంగా ముఖ్యంగా కానిస్టేబుల్ స్థాయిలో తీవ్ర ఒత్తిడిలో నలిగిపోతున్నారు. కానిస్టేబుల్ నుంచి సీఐ స్థాయి వరకు వీక్లీ ఆఫ్ వర్తించేలా ప్రభుత్వం 2019 జూన్‌లో ఉత్తర్వులు ఇచ్చింది. స్టేషనులోని మొత్తం సిబ్బందిలో ప్రతి ఏడుగురిలో ఒకరు చొప్పున ప్రతి రోజూ వీక్లీ ఆఫ్ తీసుకోవాలి. సిబ్బంది పూర్తి స్థాయిలో ఉన్నచోట కూడా స్టేషన్ అధికారి దయపైనే వారాంతపు సెలవు ఆధారపడి ఉంటోంది.

విఫలమవుతున్న ప్రయోగం..

దాదాపు అన్ని డిపార్ట్మెంట్లలో వీక్లీ ఆఫ్ పద్ధతి అమల్లో ఉంది. కానీ, ఒక్కపోలీస్ శాఖలో మాత్రమే వారాంతపు సెలవు అమలు కావడం లేదు. దీంతో కుటుంబానికి, పిల్లలకు దూరంగా ప్రతిరోజూ దాదాపు 18 నుంచి 20 గంటలు పోలీసులు విధుల్లో ఉండాల్సి వస్తోంది. అయితే, పోలీసులు.. ముఖ్యంగా కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్ఐ, ఎస్ఐ స్థాయి సిబ్బంది అత్యధికంగా క్షేత్ర స్థాయిలోనే పనిచేస్తుంటారు. దీంతో వీరు నిరంతరం విసుగు, మానసిక ఒత్తిడికి లోనవుతుంటారు. ఈ క్రమంలో పోలీసులకు ఉన్న చిరకాల స్వప్నం వీక్లీ ఆఫ్ అంశాన్ని ఎలాగైనా అధిగమించాలనే ఉద్దేశంతో గతంలో పలుమార్లు ఉన్నత స్థాయి చర్చల్లో ప్రస్తావనకు వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం, డీజీపీ స్థాయి అధికారులు ఎన్నో ప్రయత్నాలు చేశారు. నాలుగున్నరేళ్లు గడిచిపోయినా సీఎం ఇచ్చిన ఉత్తర్వులు పూర్తి స్థాయిలో అమల్లోకి రాలేదు.

విచ్చలవిడిగా విధ్వంసం

(మొదటి పేజీ తరువాయి)

గ్రామాల్లో హార్వెస్ట్ చేసిన జామాయిల్ కలప పక్కదారి పట్టింది. ఇందులో ఉంగుటూరుకి చెందిన వ్యక్తి కీలక పాత్రధారి అన్న ఆరోపణలున్నాయి. కొందరు వీఎస్ఎస్ ప్రతినిధులు, అటవీ సిబ్బంది కుమ్మక్కై సొమ్ము చేసుకున్నారు.

గోపినాథపట్నం అటవీ ప్రాంతంలో కైకరానికి చెందిన ఓ వ్యక్తి యంత్రాలతో మట్టి తవ్వేస్తున్నారు. ఉద్యాన విశ్వవిద్యాలయం వెనుక భాగంలోనూ మట్టి తవ్వకాలకు అడ్డే లేదు.

విద్యుత్తు లైన్ ముసుగులో..

మారుమూల గ్రామం మోదెలకు విద్యుత్తు లైన్ నిర్మాణం ముసుగులో వేలేరుపాడు, బుట్టాయగూడెం మండలాల మధ్య వందల చెట్లను నేలకూల్చారు. అప్పటి జేసీ అరుణ్ బాబు ఆ మార్గంలో ప్రయాణిస్తూ చెట్లు నరికి ఉండటాన్ని చూసి నిలదీశారు. దీంతో ఉన్నతాధికారులు విచారణ చేశారు. అప్పట్లో ఇద్దరు అటవీ సిబ్బంది సస్పెండ్ అ-య్యారు.

కామయ్యపాలెం సెక్షన్లో నరికి రవాణా చేస్తున్న 5 ట్రాక్టర్ల మారుజాతి కలపను గత నవంబరులో ప్రత్యేక బృందం అధికారులు పట్టుకున్నారు. వందల ఏళ్ల నాటి నల్లమద్ది, తెల్లమద్ది, పాల, కొండ తంగేడు బిల్లి, ముసిని వంటి మారుజాతుల దుంగలు నరికేశారు. స్థానిక ఉద్యోగులు చేతులు కలుపుతుండటంతో అక్రమాలు వెలుగులోకి రావడం లేదు.

నకిలీ మద్యంతో ప్రాణాలు తీస్తున్నారు

తేత్కూరు (జర్నలిస్ట్ ఫైల్) : మాజీ మంత్రి ఆత్కూరు నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి వైసీపీ సర్కార్ పై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా మద్యం వ్యాపారంతో ప్రజలను నష్టపరుస్తున్న ఘనత జగన్ దేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన ఎన్నికల ప్రచారంలో భాగంగా నియోజకవర్గంలో జోరుగా ప్రచారం నిర్వహిస్తున్న క్రమంలో మద్యం అమ్మకాలపై, మద్యం తయారీపై తీవ్రంగా ధ్వజమెత్తారు.

నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వ్యక్తి.. తాను సొంతంగా తయారు చేస్తున్న మద్యంను అధిక ధరకు అమ్ముకుంటూ.. భారీగా అక్రమ సంపాదన సంపాదిస్తున్నారని ఆరోపించారు. వీరు తయారు చేస్తున్న నకిలి మద్యం కారణంగా ప్రజల ప్రాణాలకు ఇబ్బంది కలిగే అవకాశం ఉందని దీనిపై ల్యాబ్ టెస్టింగ్ రిపోర్టు ఇచ్చారంటూ తెలిపారు. రాష్ట్రంలో ప్రజలు ఎలా పోయినా తమకు అవసరం లేదని తమ సొంతంగా తయారు చేసుకున్న మద్యానికి వారే ధర నిర్ణయించుకొని వచ్చిన డబ్బులను పంచుకుంటున్నారు అంటూ నిప్పులు చెరిగారు. ఇటువంటి దుర్మార్గపు ప్రభుత్వాన్ని పక్కనపెట్టి తిరిగి టీడీపీ గెలిపించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అప్పలనాయుడు నామినేషన్ దాఖలు

విజయనగరం (జర్నలిస్ట్ ఫైల్) : ఏపీలో పలు పార్టీల అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేస్తున్నారు. విజయనగరం లోక్ సభ స్థానంలో రెండో రోజు నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. విజయనగరం ఎంపీ అభ్యర్థిగా టీడీపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు నామినేషన్ దాఖలు చేశారు. నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మికి నామినేషన్ పత్రాలను కలిశెట్టి అందజేశారు. ఈకార్యక్రమంతో మాజీ కేంద్ర మంత్రి అశోక్ గజపతిరాజు ఉన్నారు.

కూటమికి ఓటేస్తే పథకాలన్ని అవుట్ : సీఎం జగన్

కాకినాడ (జర్నలిస్ట్ ఫైల్) : రాష్ట్రంలో ఎన్నికలకు కేవలం 25 రోజులే ఉడడంతో పార్టీలు ప్రచారంలో దూసుకెళ్తున్నాయి. ఈ నేపథ్యంలో సీఎం జగన్ 17 బహిరంగ సభల్లో పాల్గొన్నారు. శుక్రవారం 18వ రోజు మేమంతా సిద్ధం బస్సు యాత్రను కాకినాడ అచ్చంపేట జంక్షన్ లో నిర్వహించారు. ఈ బహిరంగ సభకు భారీ ఎత్తున ప్రజలు వచ్చారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ప్రసంగిస్తూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు,పవన్ కళ్యాణ్ పై విమర్శల వర్షం కురిపించారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు పేరు చెబితే గుర్తొచ్చే పథకం ఒకటి లేదన్నారు. 2014లో ఇదే ముగ్గురు కలిసి కొన్ని ముఖ్యమైన హామీలు ఇచ్చారు..అవి చేశారా? అని సీఎం జగన్ ప్రశ్నించారు. ఆడబిడ్డ పుడితే 25 వేలు అకౌంట్లో వేస్తామన్నారు వేశారా? రైతు రుణమాఫీ చేస్తామన్నారు చేశారా? అని ధ్వజమెత్తారు. కొత్తగా సూపర్ సిక్స్ అంటున్నారు. నమ్ముతారా అంటూ ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో నే తాము గెలిస్తే పథకాలు కొనసాగుతాయని చెప్పారు. టీడీపీకి ఓటు వేస్తే పథకలు రద్దు చేస్తారని చెప్పారు. మళ్లీ సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైసీపీ

ప్రభుత్వం రావాలని పేర్కొన్నారు. మీరు వేసె ఓటే ఐదేళ్ల భవిష్యత్తు అని సీఎం జగన్ తెలిపారు.

ఈ సందర్భంగా పవన్ కల్యాణ్, చంద్రబాబుపై సెటైర్లు వేశారు. 'జ్వరం వస్తే ప్యాకేజీ స్టార్ పిఠాపురం వదిలేసి హైదరాబాద్ పారిపోయే రకం. దత్తపుత్రుడు టికెట్లు ఇస్తే ఏర్పడిన కూటమి కాదు. దత్త పుత్రుడు ఎక్కడ పోటీ చేయాలనేది కూడా చంద్రబాబునే నిర్ణయిస్తారు. గ్లాజు గ్లాస్ తాగేది చంద్రబాబునే. దాన్ని శుభ్రం చేసి మళ్లీ చంద్రబాబుకు ఇచ్చేది ప్యాకేజీ స్టారే. బీఫామ్ ఎవరిదైనా యూనిఫాం చంద్రబాబుదే. చంద్రబాబును ముఖ్యమంత్రినే చేసేందుకే పురంధేశ్వరి పని చేస్తున్నారు. చంద్రబాబు పేరు చెబితే ఒక్క పథకం కూడా గుర్తు రాదు. అందుకే నాపై గులకరాళ్లు వేయించారు. ఫ్యాన్కు ఓటేస్తేనే ఆరోగ్యశ్రీ కొనసాగుతుంది. కాపు నేస్తం కొనసాగుతుంది. గ్రామాల్లో విలేజ్ క్లినిక్స్ ఉంటాయి. ఎవరు అధికారంలో ఉంటే మంచి జరుగుతుందో వారికే ఓటు వేయండి. గత ఎన్నికల్లో మాకు కొంతమంది ఓటు వేయలేదు. కాని వివక్ష లేకుండా వారికి కూడా పథకాలు అందించాం. రాష్ట్రాన్ని దోచుకునేందుకే రాజకీయాలు చేస్తున్నారు. చంద్రబాబు సాధ్యం కాని హామీలు ఇస్తున్నారు. ప్రజలు నమ్మొద్దు.' అంటూ సీఎం జగన్ పిలుపునిచ్చారు.

ప్రజల భవిష్యత్‌ను మార్చే ఎన్నికలు ఇవి : చంద్రబాబు

తేలూరు (జర్నలిస్ట్ ఫైల్) : " ఆంధ్రప్రదేశ్ చరిత్ర మార్చే కీలక తరుణమిది. ఏపీ ప్రజల భవిష్యత్‌ను మార్చే ఎన్నికలు ఇవి. ఆలూరు అదరగొట్టింది.. కర్నూలు సై అంటూ కాలు దువ్వింది. వైసీపీని చిత్తుగా ఓడించడం కూటమికే సాధ్యం. కేంద్రంలో మళ్లీ వచ్చేది ఎన్డీఏ ప్రభుత్వమే. కేంద్ర సహకారం కూడా ఏపీకి అవసరం. సాధారణ కార్యకర్తకు ఎమ్మెల్యే సీటు ఇచ్చిన ఘనత టీడీపీదే. ఎంపీటీసీని ఎంపీగా నిలబెట్టి గెలిపించబోతున్నాం. టీడీపీ అభ్యర్థులను బ్రహ్మాండమైన మెజార్టీతో గెలిపించాలి" అని చంద్రబాబు అన్నారు.

కర్నూలు జిల్లా ఆలూరులో నిర్వహించిన ప్రజాగళం సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఏబీసీడీ వర్గీకరణ తెచ్చి మాదిగలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రాన్ని జగన్.. రూ.13లక్షల కోట్ల అప్పుల కుప్పగా మార్చి, ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితికి తీసుకొచ్చారని ధ్వజమెత్తారు. కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా తెస్తామన్నారు.. తెచ్చారా? అని ప్రశ్నించారు. కూటమి అధికారంలోకి రాగానే.. స్థానిక సంస్థలకు ప్రాధాన్యమిస్తామని, గ్రామాల్లో సర్పంచ్లకే అధికారం ఉంటుందని హామీ ఇచ్చారు. కేంద్రంలో మళ్లీ

వచ్చేది ఎన్డీయే ప్రభుత్వమేనని, కేంద్రం సహకారం కూడా రాష్ట్రానికి అవసరమన్నారు. "వైకాపా పాలనలో ప్రజల ఆదాయం పెరిగిందా? విద్యపై పెట్టిన ఖర్చు ఎంత? వచ్చిన ఫలితాలేంటి? వైకాపా నేతలు దోచింది ఎంత? దాదుచుకున్నది ఎంత? రాష్ట్రంలోనే అత్యంత ధనికుడు జగన్. ఇష్టానుసారం భూములు దోచుకున్నారు. జగన్ చేసే పనులకు.. చెప్పే మాటలకు పొంతన ఉందా? రాయలసీమకు ఒక్కసాగునీటి ప్రాజెక్టు కూడా ఇవ్వలేదు. ఒక్క పరిశ్రమ తెచ్చారా? ఒక్క ఉద్యోగం ఇచ్చారా? ఆరోగ్యశ్రీ బిల్లులు చెల్లించకుండా పేదల ఆరోగ్యాలతో ఆడుకునే పరిస్థితి వచ్చింది" అని చంద్రబాబు మండిపడ్డారు.

జగన్ పేరు మార్చిన చంద్రబాబు

" జగన్ పేరు మార్చి.. జే..గన్ రెడ్డిగా నామకరణం చేస్తున్నాను" అని చంద్రబాబు అన్నారు. అధికారం ఇస్తే అన్ని రంగాలను, వ్యవస్థలను ధ్వంసం చేశారని ధ్వజమెత్తారు. అధికారం ఇస్తే బాధ్యతగా ఉండాలని, జగన్‌రెడ్డి మాత్రం అహంకారంతో విర్రవీగుతున్నారని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ పాలనలో ఏపీ అప్పులకుప్పగా మారిందని, రాష్ట్రంలో ఉద్యోగులకు వేతనాలు ఇవ్వలేని దుస్థితి నెలకొందని మండిపడ్డారు. రాయలసీమకు ఒక్క ప్రాజెక్టు కూడా నిర్మించలేదని విమర్శలు గుప్పించారు.

పెళ్లిళ్లే కాదు నియోజకవర్గాలూ నాలుగే

పవన్ కల్యాణ్‌పై సీఎం జగన్ సెటైర్

కాకినాడ (జర్నలిస్ట్ ఫైల్) : జనసేన అధినేత పవన్ కల్యాణ్ పై తీవ్ర విమర్శలు చేశారు సీఎం జగన్. ప్యాకేజీ స్టార్, మ్యారేజీ స్టార్ అని పవన్ ని సంబోధించారు. మరోసారి పవన్ కల్యాణ్ పెళ్లిళ్ల గురించి ప్రస్తావించారు ముఖ్యమంత్రి జగన్. పెళ్లిళ్లే కాదు నియోజకవర్గాలూ నాలుగే అంటూ పవన్ ను ఉద్దేశించి ఎద్దేవా చేశారు జగన్. కాకినాడలో మేమంతా సిద్ధం బహిరంగ సభలో జగన్ మాట్లాడారు.

"దత్తపుత్రుడికి చంద్రబాబు ప్రయోజనాలే ముఖ్యం. బాబు సిట్ అంటే సిట్టు.. స్టాండ్ అంటే స్టాండ్.. జగన్ ను తిట్టు అంటే తిట్టు.. కొట్టు అంటే కొట్టు.. ఎక్కడ నిలబడితే బాబుకు ప్రయోజనం కలుగుతుందంటే అక్కడ నిలబడతాడు. దత్తపుత్రా నీకు ఇచ్చేది 80 కాదు 20యే అంటే.. దానికి కూడా జీహుజూర్ అంటాడు. ఇదీ ప్యాకేజీ స్టార్ పరిస్థితి.

రాష్ట్రాన్ని హోల్ సేల్ గా దోచుకునేందుకు, దోచుకున్నది పంచుకునేందుకు చంద్రబాబు రాజకీయాలు చేస్తుంటే.. కులాన్ని హోల్ సేల్ గా చంద్రబాబుకి అమ్మేయగలను అనే భ్రమతో ప్యాకేజీ స్టార్ రాజకీయం చేస్తున్నాడు. ఈ ప్యాకేజీ స్టార్ కు మన రాష్ట్రం అంటే ఎంత చులకన అంటే.. జ్వరం వస్తే పిఠాపురం వదిలి హైదరాబాద్ వెళ్లిపోయినంత చులకన. ఇంతకుముందు ఈ ప్యాకేజీ స్టార్ కు పాలకొల్లు, భీమవరం, గాజువాక.. మూడయ్యాయి. ఇప్పుడు పిఠాపురం నాలుగోది. ఏ ప్రాంతమైనా ప్రేమ ఉండదు. ఈ మ్యారేజీ స్టార్ కు ఏ భార్య అయినా ప్రేమ ఉండదు. పెళ్లిల్లే కాదు ఇప్పుడు నియోజకవర్గాలు కూడా నాలుగు అయ్యాయి. చంద్రబాబు తన చంకలో ఉన్న పిలిని పిఠాపురంలో వదిలాడు" అంటూ చంద్రబాబు, పవన్ లపై విమర్శలతో విరుచుకుపడ్డారు సీఎం జగన్. దత్తపుత్రుడు పవన్ కల్యాణ్ ఎక్కడ పోటీ చేయాలన్నది కూడా చంద్రబాబు నిర్ణయించారని జగన్ అన్నారు.

నామినేషన్ వేసిన కాసేపటికే టీడీపీ అభ్యర్థి పై కేసు నమోదు

పుట్టపర్తి (జర్నలిస్ట్ ఫైల్) : రాష్ట్రంలో ఎన్నికలకు సమయం తక్కువ ఉండడంతో నామినేషన్ల ప్రక్రియ కూడా ప్రారంభమైంది. గురువారం నుంచి నామినేషన్ల దాఖలు చేసే పనిలో అన్ని పార్టీల అభ్యర్థులు బిజీబిజీగా ఉన్నారు. ఈ క్రమంలోనే ఎన్నికల్లో పోటీచేసేందుకు టికెట్ కోసం వెయిట్ చేసిన అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసి ఓటర్ల మనసును దోచుకునే పనిలో పడ్డారు. దీంతో జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో అన్ని పార్టీల మధ్య మాటల యుద్ధం కొనసాగుతుంది. ఒక పార్టీ పై మరో పార్టీ విమర్శల వర్షం కురిపిస్తున్నారు. ఈ క్రమంలో శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థికి వింత అనుభవం ఎదురైంది.

అది ఏంటంటే..పుట్టపర్తి అసెంబ్లీ స్థానం నుంచి టీడీపీ తరఫున మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి కోడలు పల్లె సింధూర రెడ్డి పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. అతని పై సర్వేల్లో వ్యతిరేక ఫలితాలు రావడంతో ఈసారి ఆయన కోడలికి టీడీపీ అధిష్టానం ఛాన్స్ ఇచ్చిందనే వార్తలు వినిపించాయి. శుక్రవారం పుట్టపర్తిలోని ఆర్వో కార్యాలయంలో ఆమె నామినేషన్ పత్రాలు సమర్పించారు. అయితే నామినేషన్ వేసిన తర్వాత ఆర్వో కార్యాలయం వద్ద సింధూర రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. అనంతరం రోడ్ షో నిర్వహించారు. దీనిపై అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. పుట్టపర్తి మున్సిపల్ కమిషనర్ అంజయ్య ఫిర్యాదు మేరకు పల్లె సింధూర రెడ్డి మీద కేసు నమోదైంది.

ఎన్నికల వేళ జనసేనకు మరో షాక్.. కీలక నేత రాజీనామా

అమలాపురం (జర్నలిస్ట్ ఫైల్): ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ జనసేన పార్టీకి వరుస షాక్లు తగులుతున్నాయి. ఇప్పటికే ఆయా నియోజకవర్గాల నుంచి కీలక నేతలు పార్టీని వీడి అధికార వైసీపీలో చేరారు. తాజాగా అదే బాటలో మరో కీలక నేత చేరారు. అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి డీఎంఆర్ శేఖర్ జనసేన ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామా లేఖను శుక్రవారం సాయంత్రం అధినేత పవన్ కల్యాణ్కు పంపించారు. అమలాపురం పార్లమెంట్ టికెట్ ఆశించిన ఆయన.. టికెట్ రాకపోవడంతో అసంతృప్తికి గురయ్యారు. కాగా, 2019 లోక్సభ ఎన్నికల్లో జనసేన తరపున పోటీ చేసిన శేఖర్ ఓటమి పాలయ్యారు. ఈ క్రమంలోనే ఈసారి అమలాపురం పార్లమెంట్ లేదా? అసెంబ్లీ టికెట్ వస్తుందని ఆశించారు. చివరకు నిరాశే ఎదురవడంతో పార్టీకి గుబ్ బై చెబుతున్నట్లు ప్రకటించారు. ఏ పార్టీలో చేరుతారో తెలియాల్సి ఉంది.

లోకేష్‌వి హత్యా రాజకీయాలు

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : ప్రశాంతంగా వున్న మంగళగిరిలో హత్యా రాజకీయాలకు పాల్పడుతున్న నారా లోకేష్‌పై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని వైసిపి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు డిమాండ్ చేశారు. వైసిపి కార్యకర్త మేకా వెంకటరెడ్డిని టిడిపి నాయకులు బైకుతో గుద్ది హత్యాయత్నం చేశారని ఆరోపించారు. మణిపాల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వెంకటరెడ్డిని శుక్రవారం పరామర్శించిన అనంతరం వారు తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం వెంకటరెడ్డి చావు బతుకుల మధ్య పోరాడుతున్నారని తెలిపారు. ఈ ఘటనకు టిడిపియే బాధ్యత వహించాలన్నారు.

టిడిపి సోషల్ మీడియాపై చర్యలు తీసుకోండి? సిఇఒకు వినతి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైసిపిపై దుష్ప్రచారానికి పాల్పడుతున్న టిడిపి సోషల్ మీడియా విభాగంపై చర్యలు తీసుకోవాలని వైసిపి కోరింది. ఈ మేరకు సిఇఒ ఎంకె మీనాను ఎమ్మెల్యే మల్లాది విష్ణు, మాజీ మంత్రి రావెల కిషోర్‌బాబు, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు నారాయణమూర్తి, లీగల్ సెల్ నాయకులు శ్రీనివాసరెడ్డి కలిసి వినతిపత్రం అందజేశారు. టిడిపి సోషల్ మీడియా విభాగం యూట్యూబ్, ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విట్టర్, రీల్స్ ద్వారా వైసిపిపై దుష్ప్రచారం చేస్తోందని వివరించారు. టిడిపి అధినేత చంద్రబాబును ఇందుకు బాధ్యుల్ని చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

షర్మిలకు ఈసీ నోటీసులు

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు ఎన్నికల కమిషన్ నోటీసులు జారీ చేసింది. ఎన్నికల ప్రచారంలో వివేకా హత్య ప్రస్తావన, వైసీపీ, అవినాష్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఈసీకి మల్లాది విష్ణు ఫిర్యాదు చేశారు. తనకు శిక్ష పడలేదంటూ రాజకీయ ప్రయోజనాల కోసం షర్మిల పదేపదే తన గురించి ప్రస్తావిస్తున్నారని దస్తగిరి సైతం ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు.

మల్లాది విష్ణు, దస్తగిరి ఇచ్చిన ఫిర్యాదును ఎన్నికల కమిషన్ పరిశీలించింది. వైఎస్ షర్మిల ఎన్నికల కోడ్ ఉల్లంగించినట్లు ఈసీ గుర్తించింది. 48 గంటల్లోగా ఫిర్యాదులపై వివరణ ఇవ్వాలని షర్మిలకు సీఈవో ముఖేష్ కుమార్ మీనా నోటీసులు జారీ చేశారు. అయితే, గడువులోగా వివరణ ఇవ్వని పక్షంలో ఎలాంటి నోటీసు ఇవ్వకుండానే చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

ఇప్పటికే, వైఎస్ వివేకా హత్య కేసుపై కడప కోర్టు సంచలన నిర్ణయాన్ని వెల్లడించిన సంగతి తెలిసిందే. వివేకా హత్య కేసుపై ఎవరు మాట్లాడొద్దని ఆదేశాల్లో పేర్కొంది. ఎన్నికల వేళ విపక్షాలు వివేకా హత్య కేసు విషయంలో వైసీపీపై ఆరోపణలు గుప్పిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వైసీపీ నేత సురేష్ బాబు కడప కోర్టు ఆశ్రయించారు. వివేకా హత్యపై ఎవరూ మాట్లాడొద్దని, షర్మిల, సునీత, చంద్రబాబు, పవన్ కళ్యాణ్, పురంధేశ్వరి, నారా లోకేష్‌కు సైతం కోర్టు కీలక సూచనలు చేసింది.

వైసీపీకి ఓటు వేస్తే డ్రైనేజీలో వేసినట్లే : వైఎస్ షర్మిలా రెడ్డి

కర్నూలు (జర్నలిస్ట్ ఫైల్) : ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి ఎన్నికల ప్రచారంలో దూసుకెళ్తున్నారు. శుక్రవారం ఆలూరులో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న షర్మిల.. ఆలూరు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఎమ్మెల్యేలకు అభివృద్ధి మీద చిత్తశుద్ధి లేదని విమర్శించారు. "ఇదే ఆలూరు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం.. ఇక్కడ చెత్త తీసి వేరే చోటకి పంపాడట. ఈ నియోజకవర్గానికి పనికి రాదని వేరే నియోజక వర్గం ఇచ్చాడట. ఇక్కడ ఫెయిల్ అయిన వ్యక్తి ఇంకో దగ్గర ఎలా పనికి వస్తాడు? కార్మిక శాఖ మంత్రిగా ఒక్క ఉద్యోగం ఇచ్చారా? నియోజక వర్గానికి పనికి వచ్చారా ? నియోజక వర్గంలో మొత్తం దోపిడీ అంట కదా" అంటూ వ్యాఖ్యలు చేశారు.

వేదవతి ప్రాజెక్ట్ పూర్తి చేస్తా అని జగన్ హామీ ఇచ్చారని.. 5 ఏళ్లలో ప్రాజెక్ట్ నిర్మాణానికి ఒక్క అడుగు పడలేదన్నారు. 2008 లో వైఎస్ఆర్ శిలాఫలకం వేశారని.. అదే ప్రాజెక్ట్‌కు జగన్ మోహన్ రెడ్డి మరో శిలాఫలకం వేశారన్నారు. జగన్ ప్రభుత్వం శిలాఫలకం ప్రభుత్వం అంటూ ఎద్దేవా చేశారు. ప్రాజెక్ట్ కట్టి ఉంటే 80 వేల ఎకరాలకు సాగునీరు వచ్చి ఉండేదన్నారు. నియోజకవర్గంలో టమాటా ఎక్కువ పండుతుందని తెలిపారు. రైతుల కోసం ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ అన్నారని.. ఇప్పటికీ కట్టలేదన్నారు. రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు.

ధర స్థిరీకరణ నిధి అని చెప్పి మోసం చేశారని మండిపడ్డారు. రైతును వైఎస్సార్ రాజును చేశాడని..

ఇప్పుడు రైతు అప్పుల పాలు అయ్యారన్నారు. మూరు?లకు, అహంకారులకు ఓటు వెయొద్దని కోరారు. "మీ ఓటు వృధా కానివ్వొద్దు. వైసీపీకి ఓటు వేస్తే డ్రైనేజీలో వేసినట్లే. ఈసారి ఆలోచన చేసి ఓటు వేయండి" అని వినతి చేశారు. కాంగ్రెస్ తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. హైదా ఇచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని స్పష్టం చేర్యశారు. అధికారమిస్తే 2.25 లక్షల ఉద్యోగాలు పక్కా అని వైఎస్ షర్మిల హామీ ఇచ్చారు.

వైఎస్ షర్మిలకు ఓటు వేసి గెలిపించండి : ఇంటింటి ప్రచారంలో వైఎస్.సునీత

పులివెందుల (జర్నలిస్ట్ ఫైల్) : న్యాయపోరాటం చేస్తున్నందువలన ప్రతి ఇంటికి రాలేకున్నానని, వైయస్.షర్మిల కు ఓటు వేసి వైఎస్ వివేక ఆత్మకు శాంతి చేకూర్చాలని మాజీ మంత్రి వైఎస్ వివేకనందరెడ్డి కుమార్తె సునీత రెడ్డి కోరారు. శుక్రవారం పట్టణంలో ఇంటింటి ప్రచారం నిర్వహించి కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తుకు ఓటు వేసి వైఎస్.షర్మిలను గెలిపించాలని కోరారు. అనంతరం విలేకరుల సమావేశంలో సునీత మాట్లాడుతూ %% వైసిపి తో న్యాయ పోరాటం చేస్తున్నానని, గత ఐదు సంవత్సరాల నుంచి మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో తాను పోరాటం చేస్తూనే ఉన్నానని, ఇప్పటివరకు తనకు ఎలాంటి న్యాయం జరగలేదని అన్నారు. వైసిపి నాయకులు వివేకానంద రెడ్డి హత్య కేసులో తనను ఏదో ఒక రకంగా

ఇబ్బందులకు గురి చేస్తూనే ఉన్నారని అన్నారు. సార్వత్రిక ఎన్నికలలో కనీసం ప్రశాంతంగా ప్రజలకు తమ గోడు వినిపించే అవకాశాన్ని కూడా ఇవ్వకుండా అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. కడప కోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ హైకోర్టుకు వెళతానని చెప్పారు. కేవలం ప్రతిపక్ష పార్టీలు మాత్రమే వివేకానంద రెడ్డి హత్య గురించి మాట్లాడకూడదని కోర్టు తీర్పు ఇవ్వడం హర్షించదగ్గ విషయం కాదన్నారు. ఈ విషయమై న్యాయపోరాటం చేస్తానని అన్నారు. న్యాయపోరాటం చేస్తూ ప్రతి ఇంటికి రాలేకపోతున్నానని ఓటర్లు తమ అమూల్యమైన ఓటును కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేస్తున్న వైఎస్ షర్మిల రెడ్డికి వేసి గెలిపించాలని సునీత కోరారు.

23న పవన్ నామినేషన్

పిఠాపురం (జర్నలిస్ట్ ఫైల్) : పిఠాపురం శాసనసభ స్థానం నుంచి పోటీ చేస్తున్న జనసేన అధినేత పవన్ కల్యాణ్ 23న నామినేషన్ వేయనున్నారు. ఈ మేరకు పార్టీ కార్యాలయం గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. పిఠాపురం అసెంబ్లీ రిటర్నింగ్ ఆఫీసర్‌కి పవన్ కల్యాణ్ స్వయంగా నామినేషన్ పత్రాలు సమర్పించనున్నారు. అదే రోజు సాయంత్రం పిఠాపురం నియోజకవర్గం ఉప్పాడలో బహిరంగ సభలో ఆయన పాల్గొంటారు. కాగా, పాలకొండ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి జనసేన తరఫున పోటీ చేస్తున్న నిమ్మక జయకృష్ణకు ఆ పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ గురువారం బీ-ఫాం అందించారు. జనసేన తరఫున బరిలోకి దిగుతున్న అభ్యర్థుల్లో 20 మందికి బుధవారమే బీ-ఫాంలు అందించారు. కాగా, మాజీ మంత్రి వట్టి వసంతకుమార్ కుటుంబానికి చెందిన వట్టి పవన్ కుమార్ గురువారం జనసేన పార్టీలో చేరారు.

ఉండి అసెంబ్లీ అభ్యర్థిగా ఎంపీ రఘురామ కృష్ణంరాజు

ఉండి (జర్నలిస్ట్ ఫైల్): పశ్చిమ గోదావరి జిల్లా ఉండి టీడీపీ అభ్యర్థి ఎవరనే దానిపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఇక్కడ నుంచి రఘురామ కృష్ణంరాజు పోటీ చేస్తారనే ప్రచారం జరుగుతోంది. సిట్టింగ్ ఎమ్మెల్యే మంతెన రామరాజును తప్పించి ఆయనకు సీటు ఇస్తారని వార్తలు వస్తున్నాయి. అయితే అధికారికంగా టీడీపీ తరఫున ఎవరికీ బీఫాం ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా నరసాపురం ఎంపీ రఘురామ కృష్ణంరాజు నామినేషన్ వేశారు.

రఘురామ కృష్ణంరాజు భార్య, కుమారుడు భరత్ శుక్రవారం ఉండి రిటర్నింగ్ కార్యాలయానికి వచ్చి నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. మరోవైపు ఈ నెల 22న నామినేషన్ వేసేందుకు టీడీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే రామరాజు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఆయన కంటే రఘురామ కృష్ణంరాజు నామినేషన్ వేయడం ఉండి నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. రఘురామ కృష్ణంరాజు నామినేషన్ వేసిన నేపథ్యంలో ఎమ్మెల్యే రామరాజు ఎలా స్పందిస్తారనేది ఆసక్తికరంగా మారింది.

అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున పీవీఎల్ నరసింహరాజు, కాంగ్రెస్ పార్టీ నుంచి వేగేశ వెంకట గోపాల కృష్ణ పోటీ చేస్తున్నారు.

దువ్వాడకు ఇంటిపోరు...

శ్రీకాకుళం (జర్నలిస్ట్ ఫైల్) : జిల్లాలో కీలక నియోజకవర్గమైన టెక్కలిలో వైసీపీ అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్‌కు ఇంటిపోరు మొదలైంది. తాను ఈనెల 22న నామినేషన్ వేస్తానని ఆయన సతీమణి, టెక్కలి జడ్పీటీసీ వాణి శుక్రవారం ప్రకటించడంతో అధికారపార్టీలో కలకలం మొదలైంది. గతేడాది ఏప్రిల్ 19న మూలపేట పోర్టు శంకుస్థాపన చేసేందుకు వచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సభలో ప్రసంగం అనంతరం నియోజకవర్గ అభ్యర్థిగా దువ్వాడ శ్రీను పేరును ప్రకటించారు. ప్రజ లందరూ ఆశీర్వదించాలంటూ కోరారు. కొద్దిరోజుల తర్వాత దువ్వాడ శ్రీను సతీమణి వాణి నేరుగా సీఎం వద్దకు వెళ్లి.. తన దగ్గరున్న ఆధారాలు.. ఇతరత్రా కీలక విషయాలను వెల్లడించి నట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో టెక్కలి వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా దువ్వాడ వాణిని జగన్ నియమించారు. ఆతర్వాత కొన్నాళ్లకు మళ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిని మార్పుచేసి దువ్వాడ శ్రీనును టెక్కలి వైసీపీ అభ్యర్థిగా అధికారికంగా ప్రకటించేశారు. ఈ నిర్ణయంపై అప్పట్లో వాణి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

పోటీ చేస్తానని ప్రకటన

సార్వత్రిక ఎన్నికలకు తాను కూడా టెక్కలి నుంచి పోటీలో దిగుతున్నట్లు.. ఈనెల 22న నామినేషన్ వేస్తున్నట్లు దువ్వాడ వాణి గురువారం ప్రకటించారు. దీంతో ఈ విషయం సంచలనమైంది. ఇంటిపోరుతోనే.. పోటీకి సై అన్నట్లుగా ప్రచారం జరుగుతోంది. ఇండిపెండెంట్‌గా నామినేషన్ వేసేందుకు సిద్ధమవుతున్న తన సతీమణి వాణిని ఎలా ఎదుర్కొంటారోనని చర్చ మొదలైంది. ఒకవేళ పోటీలో ఉంటే తన పరువు.. పార్టీ పరువేమవ్వాలన్నది సంశయమే.

విజయవాడలో సిపిఎం అభ్యర్థి బాబూరావు నామినేషన్ ర్యాలీ

విజయపాడ (జర్నలిస్ట్ ఫైల్) : : విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ సిపిఎం అభ్యర్థి చిగురుపాటి బాబురావు నామినేషన్ ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. సింగ్ నగర్ పైపుల్ రోడ్డు నుండి ఎంబి విజ్ఞాన కేంద్రం రాఘవయ్య పార్కువం-కు భారీ ర్యాలీ కొనసాగింది. నగరమంతా ఎర్రజెండాలతో రెపరెపలాడాయి. సిపిఎం సిహెచ్.బాబురావును గెలిపిద్దాం విజయవాడను మారుద్దాం.. అని నినదించారు. కాంగ్రెస్, సిపిఐ, ఆమ్ ఆద్మీ, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ ఇండియా వేదిక పార్టీలు బలపరిచిన సిపిఎం అభ్యర్థి చిగురుపాటి బాబురావుని గెలిపించాలని భారీ బైక్ ర్యాలీ చేపట్టారు. సిపిఎం సిహెచ్ బాబురావుకు మద్దతుగా భారీ స్థాయిలో మహిళలు పాల్గొన్నారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ %%. సిపిఎం పార్టీ అభ్యర్థి చిగురుపాటి బాబురావుని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సింగ్‌నగర్, పాయికాపురం, రాజీవ్‌నగర్, వాంబే కాలనీ, అనేక ప్రాంతాలు అభివృద్ధి చెందాయి అంటే కమ్యూనిస్టుల కృషి అని కొనియాడారు.

విజయవాడ అభివృద్ధి కోసం సిపిఎం పార్టీ సిహెచ్ బాబురావు ఎంతో కృషి చేశారని చెప్పారు. దేశాన్ని రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన బిజెపి దానికి మద్దతు తెలుపుతున్న టిడిపి వైసిపిలను ఓడించాలని అన్నారు. విజయవాడ అభివృద్ధికి నోచుకోకుండా చేసిన బిజెపి, తెలుగుదేశం పార్టీలను ఓడించాలని రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసిన వైసీపీని బిజెపికి మద్దతు తెలుపుతున్న పార్టీలను ఓడించాలని, రాష్ట్రాన్ని మూడు రాజధానులుగా ప్రకటించిన వైసీపీ ప్రభుత్వాన్ని ఓడించాలని పిలుపునిచ్చారు. విజయవాడ అభివృద్ధి చెందాలంటే ఇండియా కూటమి పార్టీల ద్వారా జరుగుతుందని, దానిలో భాగంగా ఇండియా కూటమి

పార్టీలు ఐక్యంగా పోరాడి సెంట్రల్ సిటీలో సిపిఎం అభ్యర్థి సిహెచ్ బాబురావును భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి, రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డె శోభనాద్రీశ్వరరావు, సిపిఎం మాజీ రాష్ట్ర కార్యదర్శి పి.మధు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు వి.గురునాథం, ఆప్ జిల్లా నాయకులు పరమేశ్వరరావు, లిబరేషన్ నాయకులు డి.హరినాథ్, ఆర్‌జెడి నాయకులు ప్రవీణ్ కుమార్, సిపిఐ జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణా, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కె.శ్రీదేవి విచ్చేశారు.

తిరుమల అటవీ ప్రాంతంలో భారీ అగ్నిప్రమాదం

తిరుమల (జర్నలిస్ట్ ఫైల్) : తిరుమలకు మూడు కిలోమీటర్ల దూరంలోని పార్వేటు మండపం సమీపంలోని తిరుమల అటవీ ప్రాంతంలో శుక్రవారం అగ్నిప్రమాదం జరిగింది. మంటలను గమనించిన టిటిడి అటవీశాఖ సిబ్బంది వెంటనే స్పందించి మంటలను అదుపులోకి తెచ్చారు. డీఎఫ్ఓ, సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది, వాటర్ ట్యాంక్‌లతో ఘటనాస్థలికి వెళ్లి మంటలను ఆర్పారు. అగ్ని ప్రమాదంలో శ్రీ గంధం చెట్లతో సహా అనేక వృక్షాలు దగ్ధమయ్యాయి. దీనికి కారణం ఇంకా తెలియరాలేదు. మధ్యాహ్నం సమయంలో ఉష్ణోగ్రతలు పెరగడమే కారణమని అధికారులు అనుమానిస్తున్నారు.

మన చంద్రన్న-అభివృద్ధి, సంక్షేమ విజనరీ' పుస్తకావిష్కరణ

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు 74వ జన్మదినాన్ని పురస్కరించుకుని, పార్టీ సీనియర్ నేత, పోలిట్‌బ్యూరో సభ్యులు టి.డి. జనార్ధన్ రూపొందించిన 'మన చంద్రన్న%-%అభివృద్ధి, సంక్షేమ విజనరీ' పుస్తకాన్ని శుక్రవారం చంద్రబాబునాయుడు తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ పుస్తకం ప్రధానంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 1995-2004 మధ్య చంద్రబాబు నాయుడు 9 సంవత్సరాలపాటు ముఖ్యమంత్రిగా, 2014 -19 మధ్య నవ్యాంధ్రప్రదేశ్‌కు 5 ఏళ్లపాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన మొత్తం 14 సంవత్సరాలలో వివిధ రంగాలలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాలను ఆయా రంగాలవారీగా అందించారు. ప్రధాన ప్రతిపక్ష నేతగా 2004-14, 2019 - 2024 మధ్య మొత్తం 15 సంవత్సరాలలో నిర్వహించిన ప్రజా పోరాటాలు, ఉద్యమాలను సైతం ఈ పుస్తకంలో ప్రస్తావించారు. 2004లో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా చేపట్టి విస్తృత సామాజిక, సేవా కార్యక్రమాలను సైతం క్లుప్తంగా పొందుపరిచారు.

"చంద్రబాబునాయుడు పేరు చెబితే ఏద్కెనా పథకం గుర్తుకొస్తుందా?" అని చౌకబారుగా విమర్శిస్తున్న వారికి.. చంద్రబాబునాయుడు ఏం చేశారో తెలియజేప్పేందుకు.. ఒక దార్శనికుడ్కెన పాలకుడు అధికారంలో ఉంటే ప్రజలకు జరిగే మేలు ఏమిటో మరోసారి గుర్తు చేసేందుకే 'మన చంద్రన్న%-%అభివృద్ధి, సంక్షేమ విజనరీ' పుస్తకాన్ని తేవడం జరిగింది" అని పుస్తక రచయిత టి.డి.జనార్ధన్ పేర్కొన్నారు. చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన పథకాలు ఏ విధంగా చరిత్రగతిని మార్చాయో అందరూ తెలుసుకోవాలని, ఆయా రంగాలలో రాష్ట్రాన్ని నెంబర్ వన్‌గా నిలిపిన వైనాన్ని, జాతీయ స్థాయిలో సాధించిన విజయాల్ని, సామాజిక న్యాయం చేయడానికి రాష్ట్రపతిగా అబ్దుల్ కలాం ని, లోక్‌సభ స్పీకర్‌గా జీయంసి బాలయోగిని, శాసనసభ స్పీకర్‌గా ప్రతిభా భారతిని ఎంపిక చేసిన ఖ్యాతి చంద్రబాబు నాయుడుకే దక్కుతుందని టి.డి. జనార్ధన్ పేర్కొన్నారు.

'మన చంద్రన్న-అభివృద్ధి, సంక్షేమ విజనరీ' పుస్తకాన్ని రచయిత టి.డి. జనార్ధన్‌ను అభినందించారు. విమర్శకుల నోటికి తాళం వేసేలా పుస్తకంలోని అంశాలు ఉన్నాయన్నారు. ఈ పుస్తక రూపకల్పనలో పాలుపంచుకున్న కాసరనేని రఘురామ్, విక్రమ్ పూల, విజయభాస్కర్, డిజైనర్ కె.శ్రీనివాస్, ఐకాన్స్ మధుసూదన్‌రాజు తదితరులను ఈ సందర్భంగా అభినందించారు.

పోస్టల్ బ్యాలెట్ ఓట్ల ఏర్పాట్లపై ఎస్ఈసీకి వర్ల రామయ్య లేఖ

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : పోస్టల్ బ్యాలెట్ ఓట్లకు తగిన ఏర్పాట్లు చేయడం లేదంటూ ఎస్ఈసీకి టీడీపీ నేత వర్ల రామయ్య లేఖ రాశారు. ఎన్నికల డ్యూటీలోని ప్రభుత్వ ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ఫామ్‌లు అందించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ల వినియోగంపై నేటికి ఎటువంటి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయలేదన్నారు. జిల్లా ఎన్నికల అధికారి ఒక నోడల్ అధికారిని ఏర్పాటు చేసి ఫామ్-12 ఇవ్వాలని, పూర్తి చేసిన వాటిని స్వీకరించాలని ఎన్నికల కమీషన్ స్పష్టంగా పేర్కొందన్నారు. పోలీసు అధికారులు అప్లై చేసుకునే ఈడీసీ/పీబీ ధరఖాస్తులకు నోడల్ అధికారి తగిన ఏర్పాట్లు చేయాలని కోరారు.

పోలీసులు పోస్టల్ బ్యాలెట్ అప్లికేషన్లను సంబంధిత ఆర్ఓలకు పంపేందుకు కూడా నోడల్ అధికారులు సహకరించాలన్నారు. ఎన్నికల సంఘం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ కొంతమంది ఆర్ఓలు ఫామ్ -12లు విడుదల చేయటం లేదని లేఖలో తెలిపారు. నేటికి పోస్టల్ బ్యాలెట్లకు సంబంధించి చాలా చోట్ల తగిన ఏర్పాట్లు చేయలేదన్నారు. ఎన్నికల సంఘం నియమ నిబంధనలు అనుసరించి పోస్టల్ బ్యాలెట్ ఫామ్‌లు అందించేలా అన్ని ఏర్పాట్లు చేయాలని కోరారు. ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని వర్ల రామయ్య లేఖలో పేర్కొన్నారు.

టీడీపీ అభ్యర్థుల్లో స్వల్ప మార్పులు

పొలిటికల్ డెస్క్ (జర్నలిస్ట్ ఫైల్) : టీడీపీ అభ్యర్థులకు అధిష్టానం ఎల్లుండి బీఫామ్‌లు అందించనుంది. ఈలోపే విభేదాలు, అసంతృప్తులు ఉన్న చోట అభ్యర్థుల్ని మార్చేస్తున్నట్లు తెలుస్తోంది. ఐదారు సీట్లలో కొత్త వారికి బీఫామ్‌లు ఇవ్వబోతున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఆఖరి నిమిషంలో అభ్యర్థుల్ని మార్చేస్తోంది.

ఉండి సీటు దాదాపు రఘురామకృష్ణరాజుకు ఖరారు చేసినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం అక్కడ రామరాజుకు సీటిచ్చిన టీడీపీ.. రామరాజుకు పశ్చిమగోదావరి జిల్లా టీడీపీ అధ్యక్ష బాధ్యతలు ఇచ్చే అవకాశం కనిపిస్తోంది. అనపర్తి %-% దెందులూరుల్లోనూ ఇంకా పంచాయితీ తేలని పరిస్థితి కనిపిస్తోంది. అనపర్తి సీటు టీడీపీకి, దెందులూరు బీజేపీకి ఇచ్చేలా ప్రతిపాదనలు వినిపిస్తున్నాయి. దెందులూరు టీడీపీ అభ్యర్థి చింతమనేని ప్రభాకర్‌తో అధిష్టానం చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. మాడుగులలో పైలా ప్రసాద్ స్థానంలో బండారు సత్యనారాయణమూర్తికి ఇచ్చే అవకాశం కనిపిస్తోంది. మడకశిరలో అనిల్‌కుమార్‌కు బదులు ఎం.ఎస్ రాజుకు ఇచ్చే ఆలోచనలో ఉన్నారని టాక్ నడుస్తోంది. తంబళ్లపల్లె అభ్యర్థి జైచంద్రారెడ్డికి బదులు..శంకర్ యాదవ్ లేదా సరళా రెడ్డికి ఇచ్చే అవకాశం కనిపిస్తోంది. ఏలూరు ఎంపీ సీట్ కూడా మార్చే ఛాన్స్ కనిపిస్తోంది. కమలాపురం, వెంకటగిరిల్లోనూ అభ్యర్థుల మార్పు చేయనున్నారని వార్తలు వినిపిస్తున్నాయి.

వైసీపీ అభ్యర్థిపై చర్యలకు ఈసీ ఆదేశం

గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) : ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా వైసీపీ నేతలు, అభ్యర్థులకు అవేమీ పట్టడం లేదు. తాము చేయాలనుకున్నది చేసుకుంటూ పోతున్నారు. తాజాగా పొన్నూరు వైసీపీ అభ్యర్థి అంబటి మురళిపై చర్యలకు ఈసీ ఆదేశాలు జారీ చేసింది. అంబటి మురళిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఎన్నికల కమిషన్ ఆదేశించింది. పొన్నూరు మండలం ములుకుదురులో ఆయన సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ విషయమై సీఈవో ముకేశ్‌కుమార్ మీనాకు టీడీపీ నేతలు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన అధికారులు అంబటి మురళి ఎన్నికల కోడ్ ఉల్లంఘించినట్లు అధికారులు నిర్ధారించారు. అంబటి మురళిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఆదేశాలు అందాయి.

తెలంగాణా వార్తలు

తెలంగాణలో బిజెపి ఎక్కువ సీట్లు గెలుస్తుంది: కిషన్ రెడ్డి

హైదరాబాద్ (జర్నలిస్ట్ ఫైల్) : తెలంగాణలో అన్ని పార్టీల కంటే బిజెపి ఎక్కువ సీట్లు గెలుస్తుందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. సికింద్రాబాద్ లోక్ సభ స్థానానికి బిజెపి అభ్యర్థి కిషన్ రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. నాలుగు సెట్ల నామినేషన్‌ను కిషన్ రెడ్డి దాఖలు చేశారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. కిషన్ రెడ్డితో పాటు నిమినేషన్ సమర్పణలో ఎంపి లక్ష్మణ్, బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు. సికింద్రాబాద్ ఎంపిగా మరొక్కసారి అవకాశం ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. చివరి శ్వాస వరకు బిజెపి జెండా కోసమే పని చేస్తానని, పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్, బిజెపి మధ్యనే పోటీ ఉంటుందని, బిఆర్ఎస్‌కు డిపాజిట్లు కూడా దక్కవని కిషన్ రెడ్డి ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీకి ఓట్లు అడిగే నైతిక హక్కు లేదని విమర్శించారు. తెలంగాణలో కాషాయ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామని స్పష్టం చేశారు. లోక్ సభ ఎన్నికల్లో భాగంగా బిజెపి సికింద్రాబాద్ ఎంపి అభ్యర్థిగా నామినేషన్ వేయనున్న నేపథ్యంలో నల్లకుంటలోని శంకర మఠ్ ఆలయంలోని శ్రీ శృంగేరి అమ్మవారు, శివుని సన్నిధిలో నామినేషన్ పత్రాలను కిషన్ రెడ్డి ఉంచారు.



కాంగ్రెస్?కు 12 నుంచి 14 సీట్లు ఖాయం

హైదరాబాద్ (జర్నలిస్ట్ ఫైల్) : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 12 నుంచి 14 లోక్ సభ సీట్లు వస్తాయిన సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దానం నాగేందర్ అన్నారు. బేగంపేటలోని పైగా ప్యాలెస్?లో సనత్‌నగర్ కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి కమిటీ విస్తృత సమావేశం నియోజకవర్గ ఇన్‌చార్జి డా. కోటనీలిమ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి దానం నాగేందర్, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్ హాజరైయ్యారు. ఈ సందర్భంగా దానం మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి బీజేపీలో కలుస్తారనే విష ప్రచారాన్ని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలతో ప్రభుత్వానికి మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. సికింద్రాబాద్ పార్లమెంటు సీటును గెలిచి రాహుల్ గాంధీకి బహుమతిగా ఇస్తామని డా. కోటనీలిమ అన్నారు. ప్రతి బూత్‌లో మెజార్టీ వచ్చేలా కార్యకర్తలు కృషి చేయాలని అనిల్ కుమార్‌యాదవ్ అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఫెరోజ్‌ఖాన్, డా. రవీందర్‌గౌడ్, విశాల్‌సుధాం, మునీర్‌ఖాన్, సలీంఖాన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సర్కార్ పై బజేపీ కుట్ర చేస్తోందని కేసీఆర్ అనడం సరికాదు: లక్ష్మణ్

హైదరాబాద్ (జర్నలిస్ట్ ఫైల్) : బీఆర్ఎస్, కాంగ్రెస్ కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయని బీజేపీ రాజ్యసభ సభ్యుడు డా.కె.లక్ష్మణ్ ధ్వజమెత్తారు. శుక్రవారం సికింద్రాబాద్ లో కిషన్ రెడ్డి నామినేషన్ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో మాట్లాడిన ఆయన.. కాంగ్రెస్ సర్కార్ ను కూల్చేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని కేసీఆర్ అనడం సరికాదని అన్నారు. ప్రజలే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలుస్తారని హాట్ కామెంట్స్ చేశారు. బీఆర్ఎస్ అడుగు జాడలో కాంగ్రెస్ పయనిస్తోందని దుయ్యబట్టారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని ఆరోపించారు. సికింద్రాబాద్ బీజేపీకి కంచుకోట అని, ఇక్కడ కమలం పార్టీ గెలుపు ఖాయం అయిందన్నారు. సికింద్రాబాద్ ప్రజల తలలో నాలుకలా కిషన్ రెడ్డి పని చేశారని రాబోయే ఎన్నికల్లో సికింద్రాబాద్ లో కాంగ్రెస్, బీఆర్ఎస్ మచ్చుకైనా ప్రభావం చూపవన్నారు. 17 స్థానాల్లో బీజేపీ గెలుపు దిశగా వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

తెలంగాణ స్టేట్ ఆడిట్ అడ్వైజరీ బోర్డ్ అధ్యక్షులుగా ఎం.వేణుగోపాలరావు

హైదరాబాద్ (జర్నలిస్ట్ ఫైల్) : సీనియర్ జర్నలిస్ట్ ఎం. వేణుగోపాలరావు తెలంగాణ స్టేట్ ఆడిట్ అడ్వైజరీ బోర్డ్ (ఎస్ఎఎబి) అధ్యక్షులుగా నియమితులయ్యారు. 2024-26 రెండేళ్లపాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. ఈమేరకు కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా (కాగ్) తెలంగాణ ఐఎఎస్ అధికారి పి. మాధవి గురువారం విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మే రెండో వారంలో జరగనున్న ఎస్ఎఎబి సమావేశానికి హాజరుకావాల్సిందిగా ఆ ఉత్తర్వుల్లో తెలిపారు. సీనియర్ జర్నలిస్ట్ అయిన ఎం.వేణుగోపాలరావు ప్రజాశక్తిలో సుదీర్ఘ కాలం పనిచేశారు. ఎస్ఎఎబి సభ్యులుగా నియమితులైన వేణుగోపాలరావుకి ప్రజాశక్తి ఎడిటర్ బి.తులసీదాస్, సిజిఎం వై.అచ్యుత్‌రావు అభినందనలు తెలిపారు.

సాగర్ జలాలు వస్తున్నాయ్..

హైదరాబాద్ (జర్నలిస్ట్ ఫైల్) :తెలుగు రాష్ట్రా ల్లోని కృష్ణానది పరివాహకంగా ఉన్న ప్రాంతాల్లో వేసవిలో తాగునీటి అవసరాల కోసం కృష్ణా నదీ యాజమాన్య బోర్డు నీటి విడుదల ఉత్తర్వులు జా రీ చేసింది. నాగార్జున సాగర్ జలాశయంలో ని లువ ఉన్న నీటినుంచి 14టిఎంసీలను తెలం గా ణ ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు విడుదల చేయా లని గురువారం నాడు విడుదల చేసిన ఆదేశా ల్లో స్పష్టం చేసింది. ఇందులో తెలంగాణ రాష్ట్ర వా టాగా 8.5టిఎంసీలు , ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వా టాగా 5.5టిఎంసీల నీటిని విడుదల చేయాలని పేర్కొంది. ఈ నెల 12 వ తేదీన జరిగిన త్రిసభ్య కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా కృష్ణానదీయజమాన్య బోర్డు ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకొని నాగార్జునసాగర్‌లో 500 అడుగుల వరకు నీటిని వినియోగించుకోవాలని సమావేశంలోనిర్ణయించారు.

500 అడుగుల వరకు సాగర్‌లో 14.195 టీఎంసీల వరకు నీటి వినియోగానికి అవకాశం ఉంది. అందులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఐదున్నర టీఎంసీలు కేటాయించారు. మిగిలిన నీరు హైదారాబాద్ సహా ఇతర జిల్లాల తాగునీటి అవసరాల కోసం వినియోగానికి తెలంగాణకు అనుమతి ఇచ్చారు. ఎండలు ముదిరి ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నందున నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకొని పూర్తిగా తాగునీటి అవసరాల కోసమే ఈ నీటిని వినియోగించుకోవాలని కృష్ణా నదీ

యాజమాన్య బోర్డు స్పష్టం చేసింది. హైదరాబాద్ జనాభాను పరిగణలోకి తీసుకొని తాగునీటి కోసం ఎక్కువ మొత్తం కేటాయించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకుని నీటివాటాలను కేటాయించారు. దీంతో నాగార్జునసాగర్‌లో 500 అడుగులపై ఉన్న 14 టీఎంసీల నీటిని రెండు రాష్ట్రాలకు కేటాయింపులు చేస్తూ నిర్ణయం తీసుకొన్నారు.

508 అడుగులకు తగ్గిన సాగర్

నాగార్జునసాగర్ ప్రాజెక్టులో నీటిమట్టం 508.20అడుగులకు పడిపోయింది. రిజర్వాయర్‌లోకి ఎగువ నుంచి 940క్యూసెక్కుల నీరు చేరుతుండగా , సాగర్ నుంచి 6770క్యూసెక్కుల నీరు బయటకు విడుదలవుతోంది. ప్రాజెక్టులో 128టిఎంసీల మేరకు నీటి నిలువ ఉన్నట్టు అధికారులు వెల్లడించారు. ఎగువన శ్రీశైలం ప్రాజెక్టులో నీటిమట్టం 809అడుగుల వద్ద జలాశయంలో నీటినిలువ 33.72టిఎంసీలు ఉంది. పులిచింతల ప్రాజెక్టులో నీటినిలువ 4.01టిఎంసీలు వున్నట్టు అధికారులు వెల్లడించారు. దిగవన ప్రకాశం బ్యారేజిలో 1.67క్యూసెక్కుల నీరు నిలువ వుంది.

కాంగ్రెస్ అరచేతిలో వైకుంఠాన్ని చూపిస్తుంది: కేటీఆర్

హైదరాబాద్, జర్నలిస్ట్ ఫైల్

యువతకు అరచేతిలో వైకుంఠం చూపించి తెలంగాణలో అధికారంలోకి వచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దుయ్యాబట్టారు. అధికారంలోకి వచ్చాక అసలు అటువంటి హామీ ఏమివ్వలేదని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట మార్చారని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఆగ్రహం వ్యక్తంచేశారు.

కపట నీతికి మారుపేరు కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. అన్ని వర్గాల ప్రజలకు.. ముఖ్యంగా తమ 120 రోజుల పాలనలోనే కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులతో సహా అందరికీ ద్రోహం చేయడం ప్రారంభించిందని విమర్శించారు. ప్రియాంక గాంధీ వంటి కాంగ్రెస్ అగ్రనాయకులు అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగులకు రూ.4 వేల నిరుద్యోగ భృతి అందిస్తామని హామీ ఇచ్చారన్నారు.

'ఫిబ్రవరి 1 నుంచి ఉద్యోగ నోటిఫికేషన్లు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ అన్ని వార్తాపత్రికల మొదటి పేజీల్లో తమ జాబ్ క్యాలెండర్ గురించి ప్రకటనలు ఇచ్చింది. వాస్తవానికి బీఆర్ఎస్ హయాంలో భర్తీ చేసిన 30 వేల ఉద్యోగాలకు కేవలం నియామక పత్రాలను ఇచ్చి ఆ ఉద్యోగాలను కాంగ్రెస్ పార్టీ నిస్సిగ్గుగా తమ ఖాతాలో వేసుకుంటోంది. అన్ని పోటీ పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తామన్న హామీపై యూ టర్న్ తీసుకుంటూ.. టెట్ పరీక్ష ఫీజును రూ.400 నుంచి రూ.2వేలకు (2 పేపర్లకు) పెంచింది. బల్మూరి వెంకట్ వంటి ఆ పార్టీ నాయకులను ఎన్నో కోర్టు కేసులు వేసి.. అనేక పోటీ పరీక్షలు

రద్దవ్వడానికి కారణమయ్యారు. నిరుద్యోగుల ఉసురు పోసుకుని, ప్రతిఫలంగా వెంకట్ ఎమ్మెల్సీ పదవిని అందుకున్నాడు. కానీ.. ప్రభుత్వ ఉద్యోగ ఆశాపహులను మాత్రం దిక్కుతోచని స్థితిలో పడిలేసింది కాంగ్రెస్. ఆ పార్టీ అసలు రంగు ఇప్పుడిప్పుడే బయటపడుతోంది. తమని నట్టేట ముంచిన కాంగ్రెస్ పార్టీకి నిరుద్యోగ యువత గుణపాఠం చెప్పాల్సిన సమయం వచ్చింది' అంటూ ట్వీట్ చేశారు.

నార్సింగి ఓఆర్ఆర్ పై భారీ ట్రాఫిక్ జామ్

5కిలో మీటర్ల మేర నిలిచిన వాహనాలు

హైదరాబాద్ (జర్నలిస్ట్ ఫైల్) : నార్సింగి ఔటర్ రింగ్ రోడ్డు పై భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. చిలుకూరు బాలాజీ ఆలయానికి బారులు తీరారు భక్తులు. దీంతో ఔటర్ రింగ్ రోడ్డు, పోలీస్ అకాడమీ, మొయినాబాద్ రూట్ లో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. 5 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి.

24న ఆదిలాబాద్ కు ఏక్ నాథ్ షిండే

నిర్మల్ (జర్నలిస్ట్ ఫైల్) : మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్ నాథ్ షిండే ఈ నెల 24న ఆదిలాబాద్ కు రానున్నారు. ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థి జి నగేష్ నామినేషన్ దాఖలు కార్యక్రమానికి హాజరయ్యేందుకు షిండే వస్తున్నట్లు బిజెపి వర్గాలు తెలిపాయి. నామినేషన్ కార్యక్రమం అనంతరం ఆదిలాబాద్ లో జరిగే పార్టీ ముఖ్య నేతల సమావేశానికి హాజరయ్యే అవకాశం ఉందని సమాచారం.

106 మంది ఉద్యోగులకు బిగ్ రిలీఫ్

హైదరాబాద్ (జర్నలిస్ట్ ఫైల్) : సిద్దిపేట జిల్లాలో ఎన్నికల ప్రచారం లో పాల్గొన్నారని 106 మంది బిజేపీ ఉద్యోగులపై ఎన్నికల సంఘం విధించిన సస్పెన్షన్ ఘటనలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ సస్పెన్షన్ పై హై కోర్టు స్టే విధించింది. వెంటనే వారిని విధుల్లోకి తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. న్యాయవాది చంద్రశేఖర్ రెడ్డి పిటిషన్ పై మధ్యంతర ఉత్తర్వులను హైకోర్టు జారీ చేసింది.

మహబూబ్ నగర్ ఎంపీ అభ్యర్థిగా

వంశీచంద్ రెడ్డి నామినేషన్..

మహబూబ్ నగర్ (జర్నలిస్ట్ ఫైల్) : లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో పలువురు అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేస్తున్నారు. మహబూబ్ నగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా వంశీచందర్ రెడ్డి నామినేషన్ వేసేందుకు బయలుదేరారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. దారి పొడవునా ప్రజలకు అభివాదం చేస్తూ వారు ముందుకు సాగారు.

అక్రమ కట్టడాల కూల్చివేయాలి: చాడ

హైదరాబాద్ (జర్నలిస్ట్ ఫైల్) : హైదరాబాద్ నగరంలోని నాలాలు, చెరువుల మీద అక్రమంగా నిర్మించిన కట్టడాలను కూల్చివేసేందుకు స్పెషల్ డ్రైవ్ పెట్టాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరుతూ సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి గురువారం లేఖ రాశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, బడా రాజకీయ నాయకులు వేలాది చెరువులను, కాలువలను ఆక్రమించి విల్లాలు, అపార్ట్‌మెంట్లు నిర్మించారని పేర్కొన్నారు.

పదేళ్లలో 11.48 కిమీల సొరంగం తవ్వాం: హరీష్ రావు

హైదరాబాద్ (జర్నలిస్ట్ ఫైల్) : శ్రీశైలం ఎడమ గట్టు కాల్వ (ఎస్ఎల్‌బీసీ) ప్రాజెక్టును బీఆర్ఎస్ హయాంలో ప్రాధాన్యం లేని జాబితాలో చేర్చలేదని మాజీ మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. తమ పార్టీ అధికారంలో ఉన్న గత పదేళ్లలో ఎస్ఎల్‌బీసీ టన్నెల్(సొరంగం)ను 11.48 కిలోమీటర్ల మేర తవ్వడం జరిగిందని వివరణ ఇస్తూ గురువారం ఓ ప్రకటన చేశారు. ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు కోసం 43.93 కిమీల మేర టన్నెల్ తవ్వాల్సి ఉండగా 2014 దాకా 22.89 కిమీలు మాత్రమే తవ్వారని హరీశ్ తెలిపారు. టన్నెల్ నిర్మాణంలో ఆధునిక పద్ధతులు ఉన్నప్పటికీ అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పాత పద్ధతిని ఎంచుకోవడం వల్లే సకాలంలో పనులు పూర్తి కాలేదని పేర్కొన్నారు. టన్నెల్ బోరింగ్ మిషన్ మరమ్మతులకు గురయ్యేదని, ఇందుకోసం విదేశాల నుంచి నిపుణులను తెప్పించాల్సిన పరిస్థితి ఉండేదని వివరించారు. అంతేకాక, శ్రీశైలంలో నిల్వలు పెరిగినప్పుడు ఈ టన్నెల్‌లోకి నీరు వచ్చి చేరుతుందని, ఆ నీటిని డీవాటరింగ్ చేసే క్రమంలో తవ్వకంలో జాప్యం జరిగిందని వివరించారు. నెలకు 300మీటర్లు కూడా తవ్వలేరనే విషయం తేటతెల్లమయిందని, నెలకు 200మీటర్లు తవ్వినా ఏడాదికి రెండున్నర కిలోమీటర్లు మాత్రమే తవ్వగలరని తెలిపారు.

కరెంట్ కోతలంటూ తప్పుడు ప్రచారం: భట్టి

హైదరాబాద్ (జర్నలిస్ట్ ఫైల్) : కరెంట్ కోతలంటూ సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మండిపడ్డారు. తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు. రైతు బంధు కోసం ఏడు వేల కోట్లు రెడీగా ఉంచామని మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ అబద్ధం చెప్పారని, ఆ ఏడు వేలకోట్లు ఎవరి అకౌంట్‌లోకి వెళ్లాయని భట్టి ప్రశ్నించారు. బిఆర్ఎస్ నాయకులు తెలంగాణ ఆర్థిక పరిస్థితిపై అన్ని అబద్ధాలే చెప్పారని, ప్రస్తుతం బిఆర్ఎస్ చేసిన అప్పులకు వడ్డీలు కడుతున్నామని పేర్కొన్నారు. రైతులలో 93 శాతం మందికి రూ. 5500 కోట్లు రైతు బంధు విడుదల చేశామని భట్టి ప్రకటించారు. మహాలక్ష్మి స్కీం ద్వారా మహిళలకు ఫ్రీజర్నీ కల్పించామని, ఇప్పటికే ఫ్రీ టికెట్ల కింద ఆర్‌టిసి సంస్థకు రూ. 1020 కోట్లు ఇచ్చామని, మధ్యాహ్న భోజనానికి మహిళా సంఘాలకు నిధులిచ్చామని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రతిపక్షాలకు భట్టి సవాల్ విసిరారు. ధనిక రాష్ట్రంలో కొందరే లాభపడ్డారని, ధనిక రాష్ట్రంలో ఏడు లక్షల కోట్లు అప్పులు ఎందుకు చేశారని ప్రశ్నించారు. కాంగ్రెస్ రాగానే కరువు వచ్చిందని బిఆర్ఎస్నోళ్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అధికారంలోకి రాగానే శ్వేతపత్రాల ద్వారా వాస్తవాలు వివరించామన్నారు.

సీఎం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బజేపీ మాజీ ఎంపీ రవీంద్రనాయక్

హైదరాబాద్ (జర్నలిస్ట్ ఫైల్) : తెలంగాణ రాష్ట్రంలో లోక్ సభ ఎన్నికలకు ముందు బీజేపీకి బిగ్ షాక్ తగిలింది. ఇవాళ బీజేపీ మాజీ ఎంపీ రవీంద్ర నాయక్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. రవీంద్ర నాయక్ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా సీఎం కండువా కప్పి రవీంద్ర నాయక్ ను కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఇదిలా ఉండగా రాజేంద్రనగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ఇవాళ సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. అయితే ప్రకాష్‌గౌడ్ రేపు తన ముఖ్య అనుచరులతో కలిసి పార్టీలో చేరతానని సీఎం రేవంత్ రెడ్డికి తెలిపారు.

'ఈపీఎస్' పెరుగుతున్నా.. కనీస పింఛను రూ.వెయ్యేనా?

హైదరాబాద్ (జర్నలిస్ట్ ఫైల్) : ఉద్యోగుల పింఛను నిధి పథకం (ఈపీఎస్) ఆదాయం పెరుగుతున్నా.. లబ్ధిదారులు కనీస పింఛను పెంపునకు నోచుకోక ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు వృద్ధాప్య పింఛను కింద నెలకు రూ. 2 వేలు ఇస్తుండగా.. ఈపీఎఫ్వో పింఛనుదారులు దాదాపు 75 శాతం మంది నెలకు రూ. వెయ్యితో జీవితాలను నెట్టుకువస్తుండడం పరిస్థితికి అద్దం పడుతోంది. ఈ మొత్తం బీపీ, షుగర్ మాత్రల కొనుగోలుకూ సరిపోని పరిస్థితి నెలకొందని వారు వాపోతున్నారు. తక్కువ వేతనాలతో పనిచేసి పదవీ విరమణ చేసిన వారికి ప్రస్తుత అవసరాల మేరకు కనీస పింఛను మొత్తాన్ని రూ. 2 వేలకు పెంచాలంటూ ఈపీఎఫ్వో ఉన్నతస్థాయి కమిటీ ఇచ్చిన నివేదిక కేంద్ర ప్రభుత్వ సహకారం లేక అమలుకు నోచుకోవడంలేదు.

2014లో రూ.వెయ్యికి పెంపు

ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్ వో) 2014లో కనీస పింఛనును రూ. వెయ్యికి పెంచింది. అంతకుముందు దాదాపు 80 శాతం మంది పింఛనుదారులకు రూ. వెయ్యికి లోపు పింఛను లభించేది. వీరిలో కొందరికి నెలకు రూ. 25 కన్నా తక్కువ వచ్చేవి. అప్పట్లో ఈపీఎస్ నిల్వలపై వచ్చే వడ్డీ ఆదాయం తక్కువగా ఉండటం.. పింఛను చెల్లింపులు ఎక్కువ ఉండటంతో ఆలోటు భర్తీకి యజమాని చెల్లించే వాటాకు 1.16 శాతం నిధి సర్దుబాటు చేస్తామని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఆమేరకు పదేళ్లుగా తన వాటా నిధులు ఇస్తోంది. ప్రస్తుతం కేంద్ర వాటా నిధులు దాదాపు రూ. 10 వేల కోట్లకు చేరుకుంటున్నాయి. ఇదే సమయంలో కనీస పింఛను పెంచాలని గత ఐదేళ్లుగా కార్మిక సంఘాలు, ఈపీఎఫ్ వో ట్రస్టీలు డిమాండ్ చేస్తున్నారు. పలు కమిటీలు సైతం కనీస పింఛను పెంచాలని నివేదికలు ఇచ్చాయి. ఇటీవల ఉన్నతస్థాయి కమిటీ కనీస పింఛనును రూ. 2 వేలకు పెంచాలని సూచించింది. అయితే కేంద్ర ప్రభుత్వం నుంచి బడ్జెట్ సహాయాన్ని కోరాలని సూచించింది. ఈ మేరకు ఈపీఎఫ్ బడ్జెట్ సహాయం చేయాలని కోరగా.. ఆర్థిక మంత్రిత్వశాఖ తిరస్కరించింది.

భారీగా నిధులు.. వడ్డీ ఆదాయం...

ప్రస్తుతం ఈపీఎస్ ఖాతాలో నిధులు పెరిగాయి. ఈ పథకంలో 29 కోట్ల మంది సభ్యులుగా ఉండగా.. 7 కోట్ల మంది ఖాతాల నుంచి మాత్రమే పింఛను చెల్లింపులు జరుగుతున్నాయి. ఏటా యజమానుల నుంచి ఈ ఖాతాలోకి వస్తున్న చందా సైతం పెరుగుతోంది. 2022-23 ఏడాదికి చందాల రూపంలో రూ. 56,170 కోట్లు.. 2023-24లో రూ. 60,902 కోట్లు వచ్చాయి. 2024-25 ఏడాదికి కనీసం ఏడు శాతం పెరుగుదలతో రూ. 65,335 కోట్లు వచ్చే అవకాశాలున్నట్లు సంస్థ అంచనా వేస్తోంది. ఈ నిధుల్ని పబ్లిక్ ఖాతాలు, సెక్యూరిటీల్లో పెట్టుబడులతో సంస్థ వడ్డీ ఆదాయాన్ని పొందుతోంది.

కేంద్ర ప్రభుత్వ పబ్లిక్ ఖాతాల కన్నా సెక్యూరిటీల రూపంలో వచ్చే ఆదాయం ఎక్కువగా ఉంటోంది. మొత్తంగా గత మూడేళ్లుగా వడ్డీ ఆదాయం ఏడాదికి రూ. 50 వేల కోట్లకు పైనే ఉంటోంది. 2024-25 ఏడాదికి ఈపీఎస్ నిల్వల నుంచి రూ. 6.47 లక్షల కోట్లు సెక్యూరిటీల్లోకి పెట్టుబడులుగా వెళ్లనున్నాయి. ఆ ఏడాదికి ఈపీఎస్ నిల్వలు రూ. 9.88 లక్షల కోట్లకు చేరుకునే అవకాశాలున్నట్లు ఈపీఎఫ్ఎ అంచనా వేస్తోంది.

ఎన్నికల వేళ బెంగాల్ లో హింస.. కూచ్ బిహార్ లో రాళ్లదాడి

కోల్‌కతా : పశ్చిమ బెంగాల్‌లో మొదటి విడత లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్న తరుణంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొంటున్నాయి. పలు చోట్ల జరుగుతున్న హింసాత్మక ఘటనలతో బెంగాల్ రణరంగాన్ని తలపిస్తోంది. కూచ్ బెహార్ జిల్లా దిన్‌హటా ప్రాంతంలో ఎన్నికల వేళ బీజేపీ కార్యకర్త ఇంటి వద్ద బాంబు లభ్యమైంది. దీంతో గ్రామంలో ఘర్షణ జరిగింది. ఈ గొడవలో బీజేపీ కార్యకర్తకు తలకు గాయమైంది. మమతా నేతృత్వంలోని అధికార టీఎంసీనే ఈ దాడికి పాల్పడిందని బీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు. ఎన్నికల సమయంలో బెంగాల్‌లో హింస జరగవచ్చని బీజేపీ ముందు నుంచే అనుమానాలు వ్యక్తం చేస్తుండటం గమనార్హం. అదే ప్రాంతంలో గురువారం రాత్రి మరో ఘటన జరిగింది. ఇద్దరు టీఎంసీ నేతలపై గుర్తు తెలియని దుండగులు దాడి చేశారు. ఈ ఘటనలో ఇద్దరు టీఎంసీ కార్యకర్తలకు గాయాలయ్యాయి. బీజేపీ ముందస్తు కుట్రతో దాడి జరిగిందని ఉత్తర బెంగాల్ అభివృద్ధి మంత్రి, టీఎంసీకి నేత, దిన్హటా ఎమ్మెల్యే ఉదయన్ గుహా ఆరోపించారు. బాధితులు ఇద్దరూ దిన్హటాలోని బూత్ కమిటీ అధ్యక్షుడి ఇంటికి వెళుతున్న సమయంలో వారిపై ఆయుధాలతో దాడి జరిగిందని స్థానికులు పేర్కొన్నారు.

మరోవైపు.. శ్రీరామనవమి సందర్భంగా ముర్షిబాద్ లో నిర్వహించిన ఊరేగింపుపై దాడి జరిగింది. ర్యాలీ చేస్తున్న భక్తులపై గుర్తు తెలియని దుండగులు దాడికి పాల్పడ్డారు. బీజేపీనే ఈ ఘటనకు పాల్పడిందని టీఎంసీ ఆరోపిస్తుండగా.. సీఎం మమతా బెనర్జీ చేసిన విద్వేషకర ప్రసంగాలే దాడికి కారణమని బీజేపీ మండిపడుతోంది. ఈ క్రమంలో ఎన్నికల వేళ దాడులు జరగడం చర్చనీయాంశంగా మారింది.

కుల ఆధారిత రిజర్వేషన్లను ఎప్పటికీ మార్చం: అమిత్ షా..

న్యూఢిల్లీ : కుల ఆధారిత రిజర్వేషన్లపై కేంద్ర మంత్రి అమిత్ షాకీలక కామెంట్స్ చేశారు. కుల ఆధారిత రిజర్వేషన్ విధానాన్ని బీజేపీ ఎప్పటికీ మార్చదని స్పష్టం చేశారు. అంతేకాదు.. మరెవరినీ తాకనివ్వదని కూడా హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా 21 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 102 స్థానాల్లో మొదటి దశ పోలింగ్ జరుగుతోంది. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా.. రాజ్యాంగాన్ని మారుస్తారని జరుగుతున్న ప్రచారంపై స్పందించారు.

రాజ్యాంగం విషయంలో బీజేపీపై జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని అమిత్ షా స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో బీజేపీ మెరుగైన ఫలితాలను సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ముఖ్యంగా దక్షిణ భారతదేశంలో బీజేపీ అధిక సంఖ్యలో సీట్లు గెలుస్తుందన్నారు. తమిళనాడు, తెలంగాణ, కేరళ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో పార్టీ ఎక్కువ సీట్లను గెలుస్తుందని అమిత్ షా విశ్వాసం వ్యక్తం చేశారు. దక్షిణాదిన ప్రధాని నరేంద్ర మోదీకి ఉన్న ప్రజాదరణ బీజేపీకి ప్రయోజనం చేకూరుస్తుందన్నారు. 2014, 2019 సార్వత్రిక ఎన్నికలతో పోలిస్తే.. దక్షిణాదిలో బీజేపీ ఓట్ల శాతం పెరిగిందని.. తద్వారా ఈ ఎన్నికల్లో అధిక సీట్లు గెలుచుకుంటామని అమిత్ షా చెప్పారు.

ఉత్తరప్రదేశ్ ఎన్నికల బరిలో తెలంగాణ ఆడపడుచు..!

జౌన్‌పూర్ : ఒకప్పుడు రాజకీయాలంటేనే పురుషుల ఆదిపత్యం ఉండేది. కానీ ఇప్పుడు మహిళలు.. పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో పోటీ పడుతున్నారు. ముఖ్యంగా రాజకీయాల్లో కూడా నారీ శక్తిని చాటుతున్నారు. తెలుగింటి ఆడపడుచులు తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా ఉత్తర భారత దేశంలోని ఎన్నికల్లో కూడా పోటీపడుతున్నారు. గతంలో సినీ నటి జయప్రద ఉత్తరప్రదేశ్ నుంచి ఎంపీగా గెలిచి రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారు. తాజాగా తెలంగాణ ఆడపడుచు కూడా ఉత్తరప్రదేశ్ నుంచి ఎంపీగా ఎన్నికల బరిలో ఉన్నారు. ఉత్తరప్రదేశ్ నుంచి పోటీ చేస్తున్న తెలంగాణ పడుచు ఎవరో తెలుసుకోవాలంటే ఈ స్టోరీ చదవాల్సిందే.

దేశవ్యాప్తంగా జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికల్లో పురుషులతో పాటు మహిళలు కూడా బరిలో ఉన్నారు. ఎన్నికల్లో తమ అదృష్టాన్ని మహిళలు పరీక్షించుకుంటున్నారు. సూర్యాపేట జిల్లాకు చెందిన తెలంగాణ ఆడపడుచు ఉత్తర ప్రదేశ్ నుంచి ఎంపీ ఎన్నికల బరిలో నిలిచారు. యూపీలోని జౌన్‌పుర్ లోక్‌సభ స్థానం నుంచి బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) తరపున ఎన్నికల బరిలో పోటీ చేస్తున్నారు.

సూర్యాపేట జిల్లా సదిగూడెం మండలం రత్నపురం గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్యే కీసర జితేందర్ రెడ్డి కుమార్తె శ్రీ కళా రెడ్డి. 1972 లో హుజూర్ నగర్ నియోజకవర్గం నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థిగా కీసర జితేందర్ రెడ్డి గెలిచారు. చెన్నైలోనీ నిప్పు బ్యాటరీ ఇండస్ట్రీస్ అధినేత జితేందర్ రెడ్డి. శ్రీకళా రెడ్డి అమెరికాలో ఆర్కిటెక్చర్ ఇంటీరియర్ డిజైనింగ్ కోర్సు చేశారు. 2004లో టిడిపిలో చేరి కోదాడ టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నించారు. ఆ తర్వాత బిజెపి, వైఎస్ఆర్సిపి నుంచి కూడా టికెట్ ఆశించారు. శ్రీకళా రెడ్డి 2017లో యూపీకి చెందిన ధనుంజయ్ సింగ్ ను వివాహమాడారు. జౌన్‌పుర్ మాజీ ఎంపీగా, బీఎస్పీ అధినేత్రి మాయావతికి సన్నిహితుడిగా ధనంజయ్ సింగ్ కు పేరుంది. ఆయనకు కొన్ని కేసుల్లో నిందితుడిగా శిక్ష పడింది. ఎన్నికల్లో పోటీ చేసేందుకు ధనుంజయ్ సింగ్ కు కోర్టు కేసులు అడ్డంకిగా మారాయి. దీంతో జౌన్ పుర్ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ గా శ్రీకళారెడ్డి 2022లో గెలుపొందారు.

ప్రస్తుతం జౌన్ పూర్ సిట్టింగ్ ఎంపీగా బీఎస్పీ కి చెందిన శ్యామ్ సింగ్ యాదవ్ ఉన్నారు. అయితే జౌన్ పూర్ పార్లమెంటరీ నియోజకవర్గంలో ధనుంజయ్ సింగ్ కుటుంబానికి గట్టిపట్టు ఉంది. దీంతో మాయావతి సిట్టింగ్ ఎంపీ శ్యామ్ సింగ్ యాదవ్ ను కాదని ధనుంజయ్ సింగ్ భార్య అయిన శ్రీకళారెడ్డికి టికెట్ ఇచ్చింది. మెట్టింటి నుంచి ఎన్నికల బరిలో ఉన్న తాను జౌన్ పూర్ నుంచి ఎంపీగా విజయం సాధిస్తానని శ్రీకళా రెడ్డి ధీమా వ్యక్తం చేస్తున్నారు.

బేబీ ఆహార ఉత్పత్తుల్లో అధికంగా చక్కెర

న్యూఢిల్లీ : భారత్‌లో విక్రయించే నెస్లే బేబీ ఆహార ఉత్పత్తుల్లో చక్కెర శాతం ఎక్కువగా వుందని స్విస్ ఎన్‌జిఓ పబ్లిక్ అండ్ ఇంటర్నేషనల్ బేబీ ఫుడ్ యాక్షన్ నెట్‌వర్క్ (ఐబిఎఫ్ఎఎన్) ఇటీవల విడుదల చేసిన నివేదిక వెల్లడించింది. భారత్‌తో పాటూ ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొందని తెలిపింది. ఇతర యురోపియన్ మార్కెట్లలో విక్రయించే ఇదే ఉత్పత్తులతో పోలిస్తే ఈ ఉత్పత్తుల్లో అధికంగా చక్కెర వుందని స్పష్టం చేసింది.

అంతర్జాతీయంగా ఫుడ్ అండ్ బేవరేజెస్ రంగంలో అగ్రగామి సంస్థ అయిన నెస్లే తయారుచేసి, వివిధ దేశాల్లో విక్రయిస్తున్న దాదాపు 150 బేబీ ఉత్పత్తులను బెల్జియం లేబరేటరీలో పరీక్షించారు. ఆరు మాసాల శిశువులకు ఉపయోగించే అన్ని 15 సెరలాక్ ఉత్పత్తుల్లో చక్కెర శాతం ఎక్కువగా వుందని కనుగొన్నారు. అదే సమయంలో బ్రిటన్, జర్మనీల్లో విక్రయించే ఉత్పత్తుల్లో ఎలాంటి అదనపు చక్కెరలు లేవు. భారత్‌లో ఒక్కో ప్యాకెట్‌లో అదనంగా 2.7గ్రాముల చక్కెర వున్నట్లు తేలింది. ఇథియోపియా, థాయిలాండ్‌ల్లో విక్రయించే ఉత్పత్తుల్లో దాదాపు ఆరు గ్రాముల మేరా చక్కెర వుందని నివేదిక వెల్లడించింది.

0భారత్‌లో అదనపు చక్కెరకు అనుమతులు

పిల్లలకు ఉద్దేశించిన ఏ ఆహార ఉత్పత్తుల్లోనూ అదనపు చక్కెరను అనుమతించరాదని ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫార్సు చేసినప్పటికీ భారత రెగ్యులేటర్లు మాత్రం బేబీ ఫుడ్‌లో అదనంగా సుక్రోజ్, ఫ్రక్టోజ్ పరిమిత మొత్తంలో కలిపేందుకు అనుమతించారు. భారత నిబంధనలకు అనుగుణంగా భారతీయ మార్కెట్లో విక్రయించే నెస్లే బేబీ ఉత్పత్తుల్లో అదనపు చక్కెర వున్నట్లు స్పష్టంగా లేబుల్స్‌పై ముద్రిస్తున్నారు. పైగా గత ఐదేళ్ళలో తాము ఈ ఉత్పత్తుల్లో చక్కెర శాతాన్ని తగ్గిస్తున్నట్లు కంపెనీ తెలిపింది. అదనపు చక్కెరలో 30శాతం మేరా నెస్లే ఇండియా తగ్గించిందని కంపెనీ ప్రతినిధి తెలిపారు. 2022లో భారత్‌లో రూ.20వేల కోట్ల విలువ చేసే సెరిలాక్ ఉత్పత్తులను నెస్లే విక్రయించింది.

ఊబకాయం ముప్పు

బ్రెస్ట్‌ఫీడింగ్ ప్రమోషన్ నెట్‌వర్క్ ఆఫ్ ఇండియా (బిపిఎన్ఐ)కి చెందిన అరుణ్ గుప్తా మాట్లాడుతూ, రెండేళ్ళలోపు పిల్లలకు వారి ఆహారంలో అదనపు ఉప్పు లేదా చక్కెర ఇవ్వరాదని చెప్పారు. వీటిని ఇవ్వడం వల్ల వారు అనేక వ్యాధులకు గురవుతారని అన్నారు. కానీ భారత్‌లో ఈ తరహా ముప్పు బాగా ఎక్కువగా వుందని ఆమె హెచ్చరించారు. దీనివల్ల పిల్లల్లో ఊబకాయం పెరుగుతోందని ప్రభుత్వ సర్వేల్లో వెల్లడైందన్నారు.

ద్వంద్వ ప్రమాణాలు

నెస్లే ద్వంద్వ ప్రమాణాలు అనుసరిస్తోందని హెపటాలజిస్ట్ (లివర్ వ్యాధుల నిపుణులు) సిరియాక్ అబే ఫిలిప్స్ తన ఎక్స్‌పోస్టులో విమర్శించారు. నెస్లే కంపెనీకి అంతర్జాతీయంగా వంద కోట్లడాలర్లకు పైగా రిటైల్‌అమ్మకాలు వున్నాయన్నారు. తక్కువ, మధ్య తరగతి ఆదాయం గల దేశాల్లోనే ఈ విక్రయాలు ఎక్కువగా వున్నాయన్నారు. కేవలం బ్రెజిల్, భారత్‌లోనే 40శాతం అమ్మకాలు జరుగుతున్నాయన్నారు. సెనెగల్, దక్షిణాఫ్రికా వంటి పేద దేశాల్లో విక్రయించే బిస్కట్ ఫ్లేవర్డ్ సెరియల్స్‌లో అదనపు చక్కెర ఆరు గ్రాములు కలుపుతున్నారని, అదే ఉత్పత్తి స్విట్జర్లాండ్‌లో అమ్మితే అందులో అదనపు చక్కెర వుండదని, కంపెనీ ఈ రీతిన పేద దేశాలకు సంబంధించి ద్వంద్వ ప్రమాణాలు అనుసరిస్తోందని విమర్శించారు.

కేజ్రీవాల్‌ను హతమార్చేందుకు బిజెపి కుట్ర: మంత్రి అతిషి

న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను తీహార్ జైలులో హతమార్చడానికి కుట్ర జరుగుతోందని ఆమ్ ఆద్మీ పార్టీ గురువారం ఆరోపించింది. కేజ్రీవాల్‌ను అంతం చేసేందుకు తీహార్ జైలులో ప్రయత్నం జరుగుతోందని ఢిల్లీ మంత్రి అతిషి ఆరోపించారు. గత కొద్ది రోజులుగా కేజ్రీవాల్ సుగర్ లెవల్స్ నిలకడగా ఉండడం లేదని ఆమె తెలిపారు. ఇన్సులిన్ కోసం అడిగినప్పటికీ తీహార్ జైలు అధికారులు ఆయనకు ఇవ్వడం లేదని విలేకరుల సావేశంలో ఆమె ఆరోపించారు. 30 సంవత్సరాలుగా డయాబెటిస్‌తో బాధపడుతున్న వ్యక్తికి ఇన్సులిన్ ఇవ్వకపోవడం ఎటువంటి కుట్రని, అరివంద్ కేజ్రీవాల్‌ను చంపడానికి ప్రయత్నిస్తున్నారా అని ప్రశ్నించారు. ఎన్నికలలో కేజ్రీవాల్‌ను ఓడించే శక్తి బిజెపికి లేదని ఆమె తెలిపారు. అదే కేజ్రీవాల్‌ను జైలులు బంధించి చంపాలని బిజెపి కుట్ర పన్నిందని ఆమె ఆరోపించారు.

డయాబెటిక్ రోగి అయిన కేజ్రీవాల్ సుగర్ లెవల్స్ అదుపులో ఉంచుకునేందుకు రోజూ 54 యూనిట్ల ఇన్సులిన్ వేసుకుంటారని అతిషి వివరించారు. డయాబెటిక్ రోగి కాబట్టే కేజ్రీవాల్ ఇంటి భోజనం తినేందుకు కోర్టు అనుమతించిందని ఆమె తెలిపారు. సుగర్ లెవల్స్ నలికడగా ఉండేందుకు ఆయనకు ఒక ప్రత్యేకమైన ఆహారం అవసరమని ఆమె చెప్పారు. తన అనుబంధ సంస్థ ఇడి ద్వారా కేజ్రీవాల్ ఆరోగ్యాన్ని దెబ్బతీసేందుకు బిజెపి ఈరోజు ప్రయత్నిస్తోందని ఆమె ఆరోపించారు. అనారోగ్యం కారణం చెప్పి బెయిల్ పొందే ఉద్దేశంతో తన సుగర్ లెవల్స్ పెంచుకునేందుకు కేజ్రీవాల్ మామిడి పండ్లు, పూరీ, స్వీట్లు, తింటున్నారంటూ పెంచుకునేందుకు కోర్టులో ఇడి చేసిన వాదనను ఆమె ప్రస్తావిస్తూ కోర్టులో ఇడి పదేపదే అబద్ధాలు చెప్పిందని అన్నారు.

కేజ్రీవాల్ జైలులో చక్కెర కలిపిన టీ తాగుతున్నారని, స్వీట్లు తింటున్నారని కోర్టులో ఇడి చెప్పిందని, ఇడి పచ్చి అబద్ధమని ఆమె చెప్పారు. డాక్టర్ సూచించిన స్వీట్నర్‌తో స్వీట్లు, టీ తీసుకోవడానికి కోర్టు అనుమతించిందని ఆమె వివరించారు. తన సుగర్ లెవల్ పెంచుకోవడానికి కేజ్రీవాల్ అరటి పండ్లు తింటున్నారని ఇడి అసత్యాలు చెప్పిందని ఆమె తెలిపారు. అత్యవసర పరిస్థితులు ఎదురైనపుడు చాక్లెట్లు, అరటి పండ్లు అందుబాటులో ఉంచుకోవాలని డయాబెటిక్ రోగులకు డాక్టర్లే సూచిస్తారని ఆమె తెలిపారు. సీరియస్ డయాబెటిస్ ఉన్నవారికి హఠాత్తుగా సుగర్ లెవల్స్ పడిపోతాయని, అటువంటి పరిస్థితిలో ప్రాణానికే ప్రమాదమని ఆమె చెప్పారు.

పదేపదే విజ్ఞప్తి చేసినప్పటికీ కేజ్రీవాల్‌కు ఇన్సులిన్‌ను, మందులను జైలు అధికారులు ఇవ్వడం లేదని ఆమె ఆరోపించారు. కేజ్రీవాల్‌కు ఇంటి భోజనం ఆపించేందుకు ఇడి, బిజెపి అసత్యాలను ప్రచారం చేస్తున్నాయని అతిషి ఆరోపించారు. ఇంటి భోజనం ఆగిపోతే తీహార్ జైలులో కేజ్రీవాల్‌కు ఎప్పుడు భోజనం పెడతారో ఎవరికీ తెలియకుండా పోతుందని, కేజ్రీవాల్ ప్రాణాలను తీయడానికే ఈ కుట్ర జరుగుతోందని ఆమె ఆరోపించారు. ఢిల్లీ లిక్కర్ పాలసీ కుంభకోణంతో ముడిపడిన మనీ లాండరింగ్ కేసులో మార్చిలో కేజ్రీవాల్‌ను ఇడి అరెస్టు చేసింది. అప్పటి నుంచి ఆయన తీహార్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు.

దళితుడినైన నేను అయోధ్యకు వెళితే...అనుమతించేవారా?: ఖర్గే

న్యూఢిల్లీ : దళితులు, గిరిజనులు ఇప్పటికీ వివక్షను ఎదుర్కొంటున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే పేర్కొన్నారు. తమ కులాల వారిని ఇప్పటికీ దేవాలయాల్లోకి అనుమతించరని, ఒకవేళ తాను అయోధ్యకు వెళితే సహించేవారా? అని ప్రశ్నించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌లు ఎస్‌సి, ఎస్‌టి కమ్యూనిటికి చెందినవారు కావడంతోనే బిజెపి ప్రభుత్వం వారిని ఘోరంగా అవమానించిందని మండిపడ్డారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్మును అ-యోధ్య రామ మందిర ప్రతిష్టాపనకు, నూతన పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవానికి ఆహ్వానించలేదని అన్నారు. అలాగే పార్లమెంట్ భవనం శంకుస్థాపనకు రామ్‌నాథ్ కోవింద్‌కు కూడా ఆహ్వానం అందలేదని అన్నారు.

రాజకీయ ఒత్తిళ్ల కారణంగానే రామ మందిరం ప్రతిష్టాపనకు కాంగ్రెస్ దూరంగా ఉందన్న ప్రధాని మోదీ వ్యాఖ్యలను ఖండించారు. దళితులను ఇప్పటికీ దేవాలయాల్లోకి అనుమతించడం లేదని, ఒకవేళ తాను అయోధ్యకు వెళితే అంగీకరించేవారా అని ప్రశ్నించారు. ఈ ఎన్నికల్లో 400 సీట్లు సాధిస్తామన్న ప్రధాని వ్యాఖ్యలను కొట్టిపారేశారు. మూడోసారి అధికారంలోకి వస్తామని ప్రధాని కలలు కంటున్నారని, కానీ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని అన్నారు. రాజ్యాంగాన్ని మారుస్తామని బిజెపి నేతలు ఇప్పటికే వ్యాఖ్యానిస్తున్నారని అన్నారు.

రామమందిర ప్రతిష్టాపనకు కాంగ్రెస్ హాజరై ఉండాల్సిందని మీరు భావిస్తున్నారా? అన్న ప్రశ్నకు ఖర్గే ఘాటుగా స్పందించారు. మత విశ్వాసమనేది వ్యక్తిగత అంశమని, ఎప్పుడు వీలైతే అప్పుడు వెళ్లి సందర్శిస్తారని అన్నారు. ప్రధాని మోదీ పూజారి కాదని, రాజకీయ ప్రచారం కోసం రాముని విగ్రహాన్ని ప్రతిష్టించారని దుయ్యబట్టారు. రామమందిరంలో మూడొంతుల నిర్మాణం ఇంకా పూర్తి కావాల్సి వుందన్నారు. ఇది రాజకీయ వేడుకా లేదా మత వేడుకా అర్థం కాలేదని, రాజకీయాల్లోకి మతాన్ని ఎందుకు కలిపారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇప్పటికీ దేశవ్యాప్తంగా చాలా గ్రామాల్లో దళితులను దేవాలయాల్లోకి, విద్యా సంస్థల్లోకి రానీయడం లేదని, కనీసం మంచినీరు తాగేందుకు కూడా అనుమతించరని అన్నారు. ఓ దళిత వ్యక్తి వివాహ వేడుకలో గుర్రంపై సవారీ చేయడాన్ని కూడా సహించలేరని మండిపడ్డారు. అతనిని గుర్రంపై నుండి లాగి కిందపడేసి, తీవ్రంగా కొట్టిన ఘటనలు కూడా ఉన్నాయని అన్నారు. రాజకీయ ప్రచారం కోసమే తనతో పాటు మరికొందరికి ఆహ్వానాలు పంపారని ఎద్దేవా చేశారు. ఇక్కడ ప్రశ్న రామమందిరం ఆహ్వానం గురించి కాదని, తన ప్రజలను అవమానిస్తున్నారని, దోచుకుంటున్నారని మండిపడ్డారు. వారికి స్వేచ్ఛ కావాలని అన్నారు.

జాతీయ వార్తలు

నాలుగు నెలల్లో 80 మంది నక్సల్స్ హతం

న్యూఢిల్లీ : ఈ ఏడాది గడిచిన నాలుగు నెలల్లో భద్రతా బలగాలు కనీసం 80 మంది నక్సల్స్‌ను ఎన్‌కౌంటర్లలో చంపివేశాయి. కాగా ఛత్తీస్‌గఢ్‌లో 125 మంది మావోయిస్టులు అరెస్టు అయ్యారు. 150 మంది సరెండర్ అయ్యారని అధికారులు గురువారం తెలిపారు. ఈ విధంగా 2024 ప్రారంభంలోనే నక్సల్స్‌కు భారీ షాక్ తగిలింది. రెండు రోజుల క్రితం ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన భీకర ఎన్‌కౌంటర్‌లో భద్రతా బలగాల చేతిలో 29 మంది మావోయిస్టులు మృతి చెందడం, బస్తర్ జిల్లాలోని నక్సల్స్ దళాలకు పిడుగుపాటు అయింది.

లోక్‌సభ ఎన్నికల వేళ కేంద్ర హోం మంత్రిత్వశాఖ ప్రత్యేకించి వెలువరించిన గణాంకాలు వివరాల క్రమంలో దేశంలో నక్సల్స్ సంబంధిత హింసాత్మక ఘటనల ప్రభావం తగ్గిందని వివరించారు. 2014 23 మధ్యకాలంలో ఘటనలను, 200414 నడుమ జరిగిన హింసాత్మక ఘటనలను బేరీజు వేసుకుంటే ఇప్పుడు నక్సల్స్ దాడుల సంఖ్య 52 శాతం మేర తగ్గింది.

కాగా నక్సల్స్ చర్యలలో మృతుల సంఖ్యలో 69 శాతం మేర తగ్గుదల ఉంది. గతంలో ఈ నక్సల్స్ దాడులలో మృతి చెందిన వారి సంఖ్య 6035. ఇప్పుడు ఇది 1868కు తగ్గిందని వివరాలలో తెలిపారు. మావోయిస్టుల తీవ్రవాద ప్రాబల్యం ఎక్కువగా ఉంటూ వస్తున్న ఛత్తీస్‌గఢ్‌లో ఇప్పుడు కొట్టొచ్చిన మార్పు కన్పించింది. అక్కడ గత ఏడాది డిసెంబర్‌లో విష్ణు దేవ్ ప్రభుత్వం ఏర్పాటు అయిన తరువాత పూర్తి స్థాయి చురుకైన కార్యకలాపాలు చేపట్టారు. దీనితో నక్సల్స్ బలగాలు దెబ్బతినడం, అరెస్టు కావడం, సరెండర్ కావడం జరిగిందని ప్రకటనలో తెలిపారు. దేశంలో పలు ప్రాంతాలలో నక్సల్స్ కార్యకలాపాలు తగ్గుముఖం పట్టాయని పలు ఎన్నికల సభలలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా కూడా చెపుతూ వస్తున్నారు.

పండ్లరసంలో విషం కలిపారు.. ఆసుపత్రిలో ఉన్నా

:నటుడు మన్సూర్ అలీఖాన్

చెన్నై : నిన్న ఎన్నికల ప్రచారంలో ఎవరో పండ్ల రసంలో విషం కలిపి ఇచ్చారని దాని ఫలితంగానే తాను ఇప్పుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నానని నటుడు మన్సూర్ అలీఖాన్ ఆరోపిస్తూ శుక్రవారం ఓ ప్రకటనను విడుదల చేశారు. వేలూర్ నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి, నటుడు మన్సూర్ అలీఖాన్ అస్వస్థతకు గురయ్యారు. బుధవారం ప్రచారానికి చివరిరోజు కావడంతో ముమ్మరంగా ఓట్లు అభ్యర్థించారు. ఆ సమయంలో అకస్మాత్తుగా అస్వస్థతకు లోనవడంతో వెంటనే అలీఖాన్‌ను గుడియాత్తంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స తర్వాత చెన్నై కేకేనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ ఐసియులో చికిత్స పొందుతున్నారు. తనకు పండ్లరసంలో ఎవరో విషం కలిపి ఇచ్చారని ఆరోపిస్తూ %% మన్సూర్ అలీఖాన్ ప్రకటన విడుదల చేశారు. తాను గుడియాత్తం సంత నుంచి ఇంటికి బయలుదేరుతున్నప్పుడు దారిలో కొందరు పండ్లరసం, మజ్జిగ ఇచ్చారని %% పండ్లరసం తాగిన కొద్ది నిమిషాలకే కళ్లు తిరిగి గుండెల్లో నొప్పి వచ్చిందన్నారు. ప్రస్తుతం చెన్నైలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నానని ప్రకటనలో పేర్కొన్నారు.

నూతన నావికాదళాధిపతిగా వైస్ అడ్మిరల్ దినేశ్ త్రిపాఠి

న్యూఢిల్లీ : నూతన నావికాదళాధిపతిగా వైస్ అడ్మిరల్ దినేశ్ కుమార్ త్రిపాఠి బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుతం ఆ హోదాలో ఉన్న అడ్మిరల్ ఆర్.హరి కుమార్ ఈ నెల 30న పదవీ విరమణ చేయనున్నారు. ప్రస్తుతం త్రిపాఠి భారత నావికాదళ వైస్ చీఫ్ గా వ్యవహరిస్తున్నారు. 1964 మే 15న జన్మించిన ఆయన 1985 జులై 1న భారత నేవీ ఎగ్జిక్యూటివ్ విభాగంలో చేరారు. కమ్యూనికేషన్, ఎలక్ట్రానిక్ వార్ఫేర్ నిపుణుడిగా పేరుగాంచిన ఆయన వివిధ హోదాల్లో పనిచేశారు. వైఫ్ చీఫ్ గా బాధ్యతలు చేపట్టడానికి ముందు వెస్టర్న్ నావల్ కమాండ్కు ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్ గా బాధ్యతలు నిర్వర్తించారు. ఐఎన్ఎస్ వినాశ్న కమాండ్ చేసిన అనుభవమూ ఉంది. వెస్టర్న్ ఫ్లీట్కు ఆపరేషన్స్ ఆఫీసర్, నావల్ ఆపరేషన్స్కు డైరెక్టర్, నెట్వర్క్ సెంట్రిక్ ఆపరేషన్స్కు ప్రధాన డైరెక్టర్, దిల్లీలో నావల్ ప్లాన్స్కు ప్రధాన డైరెక్టర్గా పనిచేశారు. ఈస్టర్న్ ఫ్లీట్ లోనూ ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్ వ్యవహరించారు. ప్రఖ్యాత ఇండియన్ నావల్ అకాడమీకి కమాండంట్గానూ సేవలందించారు. రేవాలోని సైనిక్ స్కూల్, ఖడక్వాసాలోని ఎన్డీయే పూర్వ విద్యార్థి అయిన త్రిపాఠి.. నావల్ వార్ కాలేజ్ గోవాతోపాటు యూఎస్ఏలోనూ వివిధ కోర్సులు పూర్తి చేశారు. అతి విశిష్ట సేవా మెడల్, నౌసేన మెడల్ పురస్కారాలను అందుకున్నారు.

ఓటేయకపోయినా పర్లేదు.. మీ కుమారుడిని ఆశీర్వదించండి

ఏకే ఆంటోనీకి రాజ్‌నాథ్ సూచన

కొట్టాయం: "మీకు కుమారుడికి ఓటేయకపోయినా.. కనీసం అతడిని ఆశీర్వదించండి" అంటూ కాంగ్రెస్ సీనియర్ నేత ఏకే ఆంటోనీ రక్షణ మంత్రి రాజ్నాథ్ సింగ్ కోరారు. ఆంటోనీ కుమారుడు అనిల్ భాజపా టికెట్పై లోక్ సభ ఎన్నికల్లో పోటీ పడుతున్న సంగతి తెలిసిందే. అనిల్ గతేడాది కమలం పార్టీలో చేరారు. కేరళలోని పథనంథిట్ట నుంచి ఆయనకు టికెట్ దక్కింది. ఆ నియోజకవర్గంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో రాజ్నాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.."ఏకే ఆంటోనీజీకి నేను చెప్పాలనుకునేది ఒక్కటే. మీ కుమారుడికి మీరు ఓటు వేయకపోయినా కనీసం ఆశీస్సులైనా అందించాలి. కొద్దిరోజుల క్రితం ఆయన మాటలు ఆశ్చర్యాన్ని కలిగించాయి. ఆంటోనీ ఇబ్బందిని అర్థం చేసుకోగలను. కాంగ్రెస్ ఒత్తిడి వల్ల అలా మాట్లాడి ఉండొచ్చు" అని అన్నారు. అనిల్ భాజపాలో చేరడంపై ఇటీవల ఏకే ఆంటోనీ బహిరంగంగా స్పందించారు. తన కుమారుడు ఓడిపోవాలని, ఆయన ప్రత్యర్థి కాంగ్రెస్ అభ్యర్థి అయిన ఆంటో ఆంటోనీ విజయం సాధించాలని అన్నారు. "కాంగ్రెస్ పార్టీ మతం" అని వ్యాఖ్యానించారు. ప్రస్తుత ఎన్నికలు భారత్, దాని రాజ్యాంగ పరిరక్షణకు సంబంధించినవి అయినందునే మీడియా సమావేశంలో మాట్లాడేందుకు వచ్చినట్లు వెల్లడించారు.

తన తండ్రి వ్యాఖ్యలపై స్పందించిన అనిల్.. కాంగ్రెస్ లో కాలం చెల్లిన నేతలు ఉన్నారని, తన తండ్రి పరిస్థితి చూస్తే జాలేస్తోందని వ్యాఖ్యానించారు. పథనంథిట్టలో తన విజయం ఖాయమని స్పష్టంచేశారు.

చంద్రబాబు తరుపున నామినేషన్ వేసిన ఆయన సతీమణి భువనేశ్వరి

కుప్పం (జర్నలిస్ట్ ఫైల్) : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు తరపున ఆయన సతీమణి నారా భువనేశ్వరి నామినేషన్ దాఖలు చేశారు. శుక్రవారం కుప్పం మున్సిపాలిటీ 25వ వార్డులో శ్రీ ప్రసన్న వరదరాజ స్వామి దేవాలయంలో నామినేషన్ పత్రాలకు ప్రత్యేక పూజాలు చేసి భారీ ర్యాలీగా కుప్పం తహసీల్దార్ కార్యాలయం లో రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులకు నామినేషన్ పత్రాలు అందించారు.

తొలుత నిర్వహించిన ర్యాలీలో కార్యకర్తలను ఉద్దేశించి భువనేశ్వరి మాట్లాడుతూ వైకాపా పాలనలో ఏ వర్గానికీ న్యాయం జరగలేదన్నారు. "రాష్ట్రాభివృద్ధి కోసం చంద్రబాబు రాత్రింబవళ్లు కష్టపడ్డారు. ఆయన హయాంలో పెట్టుబడులకు చాలా మంది ముందు కొచ్చారు. ఇవాళ పరిశ్రమలు రాకపోగా.. ఉన్నవి పోయాయి. కులమతాలు వేరైనా మనమంతా ఆంధ్రులం. వైకాపా పాలనలో తెదేపా కార్యకర్తలను తీవ్రంగా వేధించారు. రాక్షస పాలన నుంచి ప్రజలు విముక్తి కోరుకుంటున్నారు. ఓటు అనే ఆయుధంతో రాక్షస పాలనను అంతం చేయాలి. అందరం కలిసి ప్రజల ప్రభుత్వాన్ని తీసుకొద్దాం" అని భువనేశ్వరి పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా చంద్రబాబు ఘన విజయం సాధించాలని కోరుతూ భువనేశ్వరికి చంద్రబాబు నామినేషన్ కు అవసరమైన ఫీజు డబ్బులను మహిళలు, విద్యార్థులు, నిరుద్యోగులు, వికలాంగులు, రైతులు విరాళంగా ఇవ్వడం జరిగింది. ఇందులో భాగంగా కుప్పం శ్రీ ప్రసన్న వరదరాజస్వామి ఆలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి పాదాల వద్ద నామినేషన్ పత్రాలను పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు నారా భువనేశ్వకి ఆలయ కమిటీ మంగళవాయిద్యాలతో స్వాగతం పలికారు. అనంతరం పూజలు నిర్వహించారు. వేదపండితులు ఆశీర్చనలను అందజేసి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

హిందూపురం నుంచి బాలకృష్ణ నామినేషన్దాఖలు

శ్రీ సత్య సాయి జిల్లా హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ కూటమి పార్టీ అభ్యర్థిగా ఆయన తన భార్య వసుంధరతో కలిసి శుక్రవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. బాలకృష్ణ నామినేషన్‌ను బాలకృష్ణ భార్య వసుంధర దేవితో పాటు టిడిపి నాయకులు ఆర్ ఎం ఎస్ షఫీవుల్లా, రమేష్ కుమార్, పరిమళ, మంజుళ లు ప్రతిపాదించారు. నామినేషన్ వేయడానికి ముందు ఆయన తన భార్య వసుంధర తో కలిసి పట్టణంలోని సుగురు ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నేరుగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయం వద్దకు చేరుకుని, నామినేషన్ దాఖలు చేశారు. బాలకృష్ణ నాయకులతో కలిసి పెనుకొండ రోడ్డు వరకు నడుచుకుంటూ వచ్చారు. రోడ్డులో బాలయ్యను అభిమానులు భుజంపై ఎత్తుకుని జై బాలయ్య అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బాలకృష్ణ చేతులు ఊపుతూ విక్టరీ సింబల్ చూపించారు. అనంతరం అక్కడ ఆయన మాట్లాడుతూ%ా% గతంలో హిందూపురం అభివృద్ధి చేసింది తన తండ్రి నందమూరి తారక రామారావు అని ఆయన హయాంలో పారిశ్రామిక వాడ, కళాశాలలు ఏర్పాటు చేశారని అన్నారు. ఇప్పుడు రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే అది చంద్రబాబుతోనే సాధ్యం అవుతుందని అన్నారు. ఇప్పటి ప్రభుత్వంతో అభివృద్ధి వెనక్కి వెళ్లిందని, రాష్ట్రం వెనక్కి వెళ్ళిందని అన్నారు. ఈ ఐదు సంవత్సరాలు ప్రతిపక్షంలో ఉన్నామని కనీస అభివృద్ధి చేపట్టలేదు అన్నారు. అయినప్పటికీ సొంత నిధులతో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలతో పాటు ఇతర సంక్షేమ కార్యక్రమాలను చేపట్టామన్నారు. మరోసారి ప్రజలు అవకాశం ఇస్తే హిందూపురం నియోజకవర్గం మరింత అభివృద్ధి చేస్తాం అన్నారు.

కేఏ పాల్ నామినేషన్

విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్) : ఏపీలో నామినేషన్ల పర్వంతో ఎన్నికల సందడి మరింత ఎక్కువైంది. తొలిరోజే పలువురు కీలక నేతలు నామినేషన్లు వేయగా.. రెండో రోజు మరింత ఎక్కువ మంది నామినేషన్లు దాఖలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే కేఏ పాల్ నామినేషన్ దాఖలు చేశారు. రానున్న ఎన్నికల్లో విశాఖపట్నం ఎంపీగా కేఏ పాల్ పోటీ చేస్తున్న సంగతి తెలిసిందే.

అయితే, ఆయన అఫిడవిట్ లో వెల్లడించిన విషయాలు ఆసక్తికరంగా ఉన్నాయి. తన పేరిట వాహనాలు కానీ స్థిరాస్తులు కానీ అప్పులు కానీ ఏమీ లేవని వెల్లడించారు. తన పేరిట కేవలం రూ. 1. 86 లక్షలు మాత్రమే ఉన్నాయని తెలిపారు. అంతేకాకుండా డిగ్రీ సెకండ్ ఇయర్ లోనే చదువు ఆపేసినట్లు పేర్కొన్నారు.

అమ్మకు బర్త్ డే విషెష్ చెప్పిన షర్మిలమ్మ

అమర్రావతి (జర్నలిస్ట్ ఫైల్) : వైయస్ విజయమ్మకు ఆమె కుమార్తె, ఏపీ పీసీసీ చీఫ్ వైయస్ షర్మిల శుక్రవారం జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నాకు జన్మనిచ్చి.. ఆ జన్మకు సార్థకత చేకూర్చుకోవడానికి నాకు అండగా, చీకటిలో వెలుగుగా, వేదనలో సాంత్వనగా, విలువలను, విశ్వాసాన్ని నింపిన నిస్వార్థ రూపం నువ్వు అమ్మ... నీకు ఆ దేవుడు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలను, మనః శాంతిని, ఆనందాన్ని ఇవ్వాలని ప్రార్థిస్తూ.. హ్యాపీ బర్త్‌డే మా అంటూ ఎక్స్ వేదికగా వైయస్ షర్మిల కన్నతల్లికి బర్త్‌డే విషెష్ చెప్పారు.

అయితే ఎన్నికల సమయంలో పీసీసీ చీఫ్ వైయస్ షర్మిల న్యాయ యాత్ర చేస్తూ.. బిజీ షెడ్యూల్ ఉండి కూడా కన్నతల్లికి బర్త్‌డే విషెష్ చెప్పారు.

మరోవైపు సరిగ్గా ఎన్నికలు సమయంలో వైయస్ విజయమ్మ యూఎస్‌లోని వైయస్ షర్మిల కుమారుడు వైయస్ రాజారెడ్డి వద్దకు వెళ్లిపోవడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ఒకే రాష్ట్రంలో అంటే... ఆంధ్రప్రదేశ్ వేదికగా అటు కుమారుడు వైయస్ జగన్, ఇటు కమార్తె వైయస్ షర్మిల ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు.

రెండో రోజు ప్రముఖుల నామినేషన్లు

పొలిటికల్ డెస్క్ (జర్నలిస్ట్ ఫైల్) : ఆంధ్రప్రదేశ్ లో రెండో రోజు నామినేషన్ల పర్వం సందడిగా సాగింది. శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థులు ర్యాలీగా వెళ్లి నామినేషన్లు సమర్పించారు. చిత్తూరు జిల్లా కుప్పంలో టీడీపీ అధినేత చంద్రబాబు తరఫున ఆయన సతీమణి భువనేశ్వరి, హిందూపురంలో నందమూరి బాలకృష్ణ (టీడీపీ), రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థిగా దగ్గుబాటి పురందేశ్వరి (బీజేపీ) నామినేషన్ దాఖలు చేశారు.

కొండపి తెదేపా అభ్యర్థిగా డోలా బాలవీరాంజనేయ స్వామి, తాడేపల్లిగూడెం నుంచి బొలిశెట్టి శ్రీనివాస్ (జనసేన), యర్రగొండపాలెంలో గూడూరు ఎరిక్సన్ (టీడీపీ), కావలిలో కావ్య కృష్ణారెడ్డి (టీడీపీ), నెల్లూరు గ్రామీణం నుంచి కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి (టీడీపీ), విజయవాడ తూర్పు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి గద్దె రామ్మోహన్ (టీడీపీ) తరఫున ఆయన సతీమణి అనూరాధ, గుంటూరు జిల్లా తాడికొండ నియోజకవర్గం నుంచి తెనాలి శ్రావణ్ కుమార్ (టీడీపీ), మంగళగిరి నియోజకవర్గం నుంచి మురుగుడు లావణ్య (వైసీపీ) నామినేషన్ పత్రాలు సమర్పించారు. పాలకొల్లులో టీడీపీ అభ్యర్థి నిమ్మల రామానాయుడు సైకిల్ పై వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు.

వైభవంగా ప్రారంభమైన చైత్ర మాస బ్రహ్మోత్సవాలు

విజయవ్వాడ (జర్నలిస్ట్ ఫైల్) : ఇంద్రకీలాద్రిపై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానములో చైత్రమాస బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. స్వస్తిశ్రీ చాంద్రమానేన శ్రీ క్రోధి నామ సంవత్సర చైత్ర శుద్ధ ఏకాదశి నుండి చైత్ర శుద్ధ చతుర్ధశి తత్కాల పౌర్ణమి వరకు ఈనెల 19 నుండి 27వ తేదీ వరకు జరిగే శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల బ్రహ్మోత్సవ కళ్యాణ మహోత్సవాలలో భాగంగా శుక్రవారం చైత్రశుద్ధ ఏకాదశి రోజున శ్రీ గంగా దుర్గ మల్లేశ్వర స్వామి వార్లకు మంగలస్నానములాచరింపజేసిన అనంతరం వధూవరులుగా అలంకరణ చేశారు.

చైత్రమాస బ్రహ్మోత్సవాల్లో భాగంగా దేవస్థానం లో ఉపాలయమైన శ్రీ మల్లేశ్వర స్వామివారి ఆలయంఒద్ద ఆలయ కార్యనిర్వహణాధికారి కె ఎస్ రామరావు సమక్షంలో మంగళ వాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ ఆలయ స్థానాచార్యులు, వైదిక కమిటీ సభ్యులు, ప్రధానార్చకులు, అర్చక సిబ్బందిచే శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె ఎస్ రామరావు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి అమ్మవార్లకు, స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. శుక్రవారం సాయంత్రం 4 గం శ్రీ విగ్నేశ్వర స్వామి వారికి పూజ, పుణ్యాహవచనము, అంకురారోపన, అఖండ దీప స్థాపన, కళాశారాధన, ధ్వజారోహన, అగ్ని ప్రతిష్టాపన బలిహరణ కార్యక్రమములు శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. అలాగే సాయంత్రం 5 లకు వెండి పల్లకీ పై స్వామి, అమ్మవార్లు శ్రీ మల్లిఖార్జున మహా మండపము నుండి బయలుదేరి కనకదుర్గా నగర్, రథం సెంటర్, బ్రాహ్మణ వీధి, కోమలావిలాస్ సెంటర్, సామారంగం చౌక్, బ్రాహ్మణ వీధి, రథం సెంటర్ మీదుగా రథోత్సవంలో భాగంగా మహా మండపానికి చేరుకోనున్నారు.

నేను సోనియా గాంధీ కాళ్లకే మొక్కలేదు

చిత్తూరు (జర్నలిస్ట్ ఫైల్) : ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ కీలక నేత కిరణ్ కుమార్ రెడ్డికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి కౌంటర్ ఇచ్చారు. శుక్రవారం పెద్దిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. తాను కాళ్లు పట్టుకున్నానని కిరణ్ కుమార్ రెడ్డి అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. నేను కాంగ్రెస్ లో ఉన్నప్పుడు ఏనాడూ సోనియా గాంధీ కాళ్లకే మొక్కలేదు అని కీలక వ్యాఖ్యలు చేశారు. చిదంబరం కాళ్లు పట్టుకొని కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రి పదవి దక్కించుకున్నారని తీవ్ర విమర్శలు చేశారు. ఏపీలో కాంగ్రెస్ ను కిరణ్ కుమార్ రెడ్డి సర్వనాశనం చేశారని సంచలన వ్యాఖ్యలు చేశారు.

కాంగ్రెస్ లో ముఖ్యమంత్రిగా పనిచేసి బీజేపీ నుంచి పోటీ చేయడం సిగ్గుచేటు అని విమర్శలు గుప్పించారు. కాగా, మొన్న కిరణ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ పెద్దిరెడ్డిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. పదవుల కోసం తాను ఎవరి కాళ్లూ పట్టుకోలేదని, పదవుల కోసం ఆత్మగౌరవం చంపుకోవాల్సిన అవసరం తనకు లేదని కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. గతంలో డీసీసీ అధ్యక్ష పదవి కోసం గెస్ట్ హౌస్ కు వచ్చి పెద్దిరెడ్డి తన కాళ్లు పట్టుకున్నాడని కీలక వ్యాఖ్యలు చేశారు. దీనిపై ఎక్కడైనా ప్రమాణం చేస్తానని సవాల్ విసిరారు. తద్వారా పెద్దిరెడ్డికే ఆత్మగౌరవం లేదని కిరణ్ గుర్తుచేశారు. తాజాగా కిరణ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యలకు కౌంటర్ ఇస్తూ పెద్దిరెడ్డి పై వ్యాఖ్యలు చేశారు.

నామినేషన్ వేసిన వైసీపీ ఎంపీ అభ్యర్థి పేడాడ తిలక్

శ్రీకాకుళం (జర్నలిస్ట్ ఫైల్) : శ్రీకాకుళం వైసీపీ ఎంపీ అభ్యర్థి పేడాడ తిలక్ నామినేషన్ దాఖలు చేశారు. సార్వత్రిక ఎన్నికలు 2024కి సంబంధించి శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ మనజిర్ జిలాని సమూన్ వారికి వైసీపీ ఎంపీ అభ్యర్థి పేడాడ తిలక్ నామినేషన్ పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అప్పలరాజు, ధర్మాన, వైసీపీ జిల్లా అధ్యక్షులు కృష్ణదాస్ లు ఉన్నారు.

దారుణ హత్యకు గురైన వైసీపీ ఎంపీటీసీ బాలకృష్ణ

(జర్నలిస్ట్ ఫైల్) : అల్లూరి జిల్లాలో వైసీపీ ఎంపీటీసీ దారుణ హత్యకు గురయ్యాడు. అల్లూరి జిల్లా ఎటపాక మండలం కన్నాయిగూడెం గ్రామానికి చెందిన వైసీపీ ఎంపీటీసీ వర్స బాలకృష్ణ (40)ను గుర్తు తెలియని వ్యక్తులు తలపై బండరాయితో మోదడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ఓ వివాహ కార్యక్రమానికి వెళ్లి తిరిగి వస్తుండగా గ్రామ శివారులో ఇద్దరు వ్యక్తులు అతడిని అడ్డగించి బండరాయితో తలపై కొట్టి హత్య చేశారు. హత్య చేసిన అనంతరం అక్కడి నుంచి వెళ్లిపోయిన ఇద్దరి నిందితులు ఏటపాక పోలీస్ స్టేషన్లో లొంగిపోయారు. పోలీసులు ఇద్దరి నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎంపీటీసీకి ఆ ఇద్దరి వ్యక్తులకు అసలు గతంలో ఉన్న వివాదం ఏంటి అనే దానిపై పోలీసులు వారిని విచారిస్తున్నారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మీ కుటుంబానికి మంచి జరిగిందంటేనే ఇలా చేయండి:

విజయనగరం (జర్నలిస్ట్ ఫైల్) : చీపురుపల్లి నియోజకవర్గంలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొత్స సత్యనారాయణ నామినేషన్ వేశారు. మీ కుటుంబానికి మంచి జరిగిందంటేనే మళ్ళీ మమ్మల్ని ఆశీర్వదించండని కోరారు. రాష్ట్రంలో సంక్షేమం ఇంటింటా అందయని కామెంట్స్ చేశారు. ఇచ్చిన హామీలను 95% పూర్తి చేసామని.. మిగతా ఐదు శాతం కూడా త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. ఎన్నికల ముందు ఎవరు స్వార్థానికి వారు మారుతారని పక్క పార్టీలవైపు వెళ్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే, మెజారిటీ ఎంత అనేది ప్రజలను నిర్ణయిస్తారన్నారు. రానున్న ఎన్నికల్లో కూడా వైసీపీనే అధికారం చేపడుతుందని ధీమా వ్యక్తం చేశారు.

రైతుల ఆత్మహత్యలన్నీ జగన్ ప్రభుత్వం

అమర్రావతి (జర్నలిస్ట్ ఫైల్) : జగన్ పాలనలో రైతుల జీవితాలు గాలిలో దీపంగా మారాయని టీడీపీ నేత, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు విమర్శించారు. రాష్ట్రంలో అన్నదాతల ఆత్మహత్యలన్నీ జగన్ ప్రభుత్వం చేసిన హత్యలేనని ఆరోపించారు. ఏపీలోని ప్రతి రైతు కుటుంబం నెత్తిన రూ. 2. 45 లక్షలకు పైగా అప్పు ఉందని చెప్పారు. తుపాన్లు, వరదలు, కరవు బాధితుల్లో కొద్దిమందికే పరిహారం అందించారన్నారు. సాగు భారమై, అప్పులు తీర్చే మార్గం లేకనే రైతులు బలవన్మరణాలు చేసుకుంటున్నారని వివరించారు. అంకెల గారడీలు, అబద్ధాలతో జగన్ బాధ్యత నుంచి తప్పించుకోలేరన్నారు.

దెందులూరు వదులుకోవడంపై టీడీపీ టెన్షన్

దెందులూరు (జర్నలిస్ట్ ఫైల్) : ఏపీలో కూటమి రాజకీయం కాకరేపుతోంది. సీట్ల సర్దుబాటులో ఒకటి రెండు మార్పులు ఉంటాయనే ప్రచారం అగ్గి రాజేస్తోంది. ముఖ్యంగా టీడీపీ ఫైర్‌బ్రాండ్ నేత సీటు కిందకు నీళ్లు వచ్చేలా పరిస్థితి కనిపిస్తుండటం.. పొలిటికల్ హైటెన్షన్‌గా మారింది. బీజేపీలోని కీలక నేత కోసం ఆ పార్టీ హైకమాండ్ ఏలూరు జిల్లాలో ఓ సీటు కేటాయించాల్సిందిగా టీడీపీ అధినేత చంద్రబాబుపై ఒత్తిడి తెస్తోందట. మరి బీజేపీ పెద్దల ఒత్తిడికి చంద్రబాబు తలొగ్గుతారా? తన మాటే శాసనంగా భావించేనేతను సైడ్ చేస్తారా? ఇంతకీ బీజేపీ అడుగుతున్న నియోజకవర్గమేది? సీటు త్యాగం చేయాల్సిన నేత ఎవరు?

ఏపీలో ఎన్‌డీఏ కూటమి సీట్లలో మళ్లీ మార్పులు చోటుచేసుకునే అవకాశాలు ఉన్నట్లు జరుగుతున్న ప్రచారం హీట్‌పుట్టిస్తోంది. సీట్లు సర్దుబాటు.. అభ్యర్థుల ప్రకటన పూర్తయిన తర్వాత వచ్చిన కొన్ని అభ్యంతరాలపై ఇప్పటికే మూడు పార్టీల మధ్య చర్చలు జరిగాయి. ఒకటి రెండు చోట్ల మార్పులు ఉండే అవకాశం ఉందని ప్రధాన పార్టీల నేతల నుంచి క్యాడర్‌కు సంకేతాలు అందాయి. కానీ, ఇప్పుడు అనూహ్యంగా ఏలూరు జిల్లా దెందులూరు

సీటులోనూ మార్పు జరగనుందనే ప్రచారం కలకలం రేపుతోంది. ముఖ్యంగా ఆ నియోజకవర్గం నుంచి టీడీపీ ఫైర్‌బ్రాండ్ చింతమనేని ప్రభాకర్ పోటీ చేస్తుండటం, రాష్ట్రవ్యాప్తంగా ఆ నియోజకవర్గంపై ఫోకస్ ఉండటంతో ఏం జరుగుతుందనే ఉత్కంఠ ఎక్కువవుతోంది.

బీజేపీ అభ్యర్థిగా తపన చౌదరి?

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా టీడీపీలో చింతమనేని కీలక నేత. రెండు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన చింతమనేని టీడీపీలో దూకుడుగా వ్యవహరిస్తుంటారు. ఆయన వ్యవహారశైలితో ఎన్నో వివాదాలకు కేంద్ర బిందువుగా మారారు. కానీ, అవే వివాదాలు ఆయనకు రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు తెచ్చాయి. గత ఎన్నికల్లో తొలిసారి ఓడిన చింతమనేని.. ఈ ఎన్నికల్లో మళ్లీ పోటీకి సిద్ధమయ్యారు. తొలి జాబితాలోనే ఆయన టికెట్‌ను కన్ఫార్మ్ చేసింది టీడీపీ.. ఐతే ఇప్పుడు ఆ సీటు నుంచి బీజేపీ నేత గారపాటి సీతారామాంజనేయ చౌదరి అలియాస్ తపనా చౌదరిని బరిలోకి దింపాలని కమలం పెద్దలు ప్రతిపాదిస్తున్నట్లు తెలుస్తోంది. సంఘ్ పరివార్ నేపథ్యం ఉన్న తపనా చౌదరి ఏలూరు పార్లమెంట్ టికెట్ ఆశించారు. ఐతే జిల్లాలో నరసాపురం పార్లమెంట్‌ను బీజేపీకి కేటాయించింది టీడీపీ. దీంతో తపన చౌదరికి అవకాశం లేకపోయింది. ఐతే బీజేపీ టికెట్లు పొందిన వారిలో సంఘ్ నేపథ్యం ఉన్నవారు తక్కువగా ఉన్నారనే అభిప్రాయంతోపాటు వలస నేతలకు టికెట్లు ఎక్కువ ఇచ్చారనే ప్రచారం నేపథ్యంలో.. ఆ అపవాదను తొలగించుకోడానికి దెందులూరును తీసుకుని తపన చౌదరిని పోటీకి పెట్టాలని భావిస్తోంది బీజేపీ.

దెందులూరును బీజేపీకి కేటాయిస్తే..

ఇప్పటికే ఈ ప్రతిపాదనను చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లినట్లు సమాచారం. దెందులూరును బీజేపీకి కేటాయిస్తే.. దానికి ప్రతిగా తూర్పుగోదావరి జిల్లాలోని అనపర్తిని టీడీపీకి వదిలేస్తామని బీజేపీ పెద్దలు ఆఫర్ చేసినట్లు చెబుతున్నారు. ఈ ప్రతిపాదనపై టీడీపీ తర్జనభర్జన పడుతున్నట్లు చెబుతున్నారు. అనపర్తిలో టీడీపీ మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి నుంచి తీవ్ర ఒత్తిడి ఉండటం.. ఆయన ఎలాగైనా పోటీ చేస్తానని చెబుతుండటం వల్ల టీడీపీ అధిష్టానం ఆలోచనలో పడినట్లు చెబుతున్నారు. ముఖ్యంగా నల్లమిల్లి పోటీలో ఉంటే బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి అనుకూలంగా ఉంటుందని, ఆయన తిరుగుబాటు చేస్తే ఫలితం తేడాగా ఉంటుందనే ఆందోళన రెండు పార్టీల్లో కనిపిస్తోంది. దీంతో దెందులూరు సీటు విషయమై చింతమనేనితో మాట్లాడాలని పార్టీ నేతలను చంద్రబాబు పంపినట్లు చెబుతున్నారు

జర్నలిస్ట్ ఫైల్
మీరు చందాదారులుగా చేరాలనుకుంటున్నారా.. సకాలంలో పేపరు అందడం లేదా.. సంప్రదించండి - 7661805968
అతితక్కువ ఖర్చుతో పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, పేరుమార్పు, లీగల్ ప్రకటనలకు... సంప్రదించండి - 7416812467

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467